మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక
www.evarthalu.com

Circulated to Telangana
Published from Jagitial

మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 19-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 || సంచిక: 20 Issue: 20

19 జూలై 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:55 సూర్యాస్తమయం - సా. 6:49 తిథి షష్ఠి తె. 3:32ం వరకు తరువాత సప్తమి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం ఉత్తర ఫల్గుని(ఉత్తర) సా. 6:12 వరకు తరువాత హస్త యోగం పరిఘ రా. 7:21 వరకు కరణం కౌలవ మ. 3:36 వరకు తైతుల తె. 3:32ం వరకు వర్జ్యం రా. 2:55 నుండి తె. 4:35 వరకు దుర్ముహూర్తం సా. 5:06 నుండి సా. 5:58 వరకు రాహుకాలం సా. 5:12 నుండి సా. 6:49 వరకు యమగండం మ. 12:22 నుండి మ. 1:59 వరకు గుళికాకాలం మ. 3:36 నుండి సా. 5:12 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:19 నుండి తె. 5:07 వరకు అమృత ఘడియలు ఉ. 10:55 నుండి మ. 12:32 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున




# స్కైరూట్.. ఆకాశమే హద్దు!

## నింగిలోకి దూసుకెళ్లిన తొలి భారత ప్రైవేట్ రాకెట్ విక్రమ్-1

## ప్రపంచంలో మూడో దేశంగా నిలిపిన చరిత్రాత్మక ప్రయోగం

భారత అంతరిక్ష రంగంలో సరికొత్త చరిత్ర లిఖితమైంది. ఇద్దరు యువ, ఇస్రో మాజీ శాస్త్రవేత్తల కల సాకారమైంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ, తమ తొలి ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-1'ను విజయవంతంగా ప్రయోగించి యావత్ దేశం గర్వపడేలా చేసింది. శ్రీహరికోట నుంచి జూలై 18న నింగిలోకి దూసుకెళ్లిన ఈ రాకెట్, భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ ఆర్బిటల్ ప్రయోగంగా నిలిచింది. 'మిషన్ ఆగమన్' పేరుతో ప్రయోగించిన 'విక్రమ్-1' రాకెట్ సుమారు 7 అంతస్తుల ఎత్తు ఉంటుంది. ఇది చిన్న ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టడానికి ప్రత్యేకంగా రూపొందించబడింది.

శ్రీహరికోట/హైదరాబాద్, జూలై 18 (ఈవార్తలు): పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో తయారైన ఈ రాకెట్‌లో 3డి ప్రింటెడ్ ఇంజన్లు, అత్యాధునిక ఏవియానిక్స్ వ్యవస్థలు ఉన్నాయి. 2022లో 'విక్రమ్-ఎస్' సబ్-ఆర్బిటల్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన స్కైరూట్, ఇప్పుడు 'విక్రమ్-1'తో పూర్తిస్థాయి వాణిజ్య ప్రయోగాలకు మార్గం సుగమం చేసుకుంది. అందరికీ అంతరిక్షాన్ని అందుబాటులోకి తేవడం అనే నినాదంతో పనిచేస్తున్న ఈ సంస్థ, ఇప్పటికే టెమాసెక్ వంటి తరువాయి 2 వ పేజీలో...




# కుర్రోళ్లు విజేతలు!

## ఉత్తమ తెలుగు చిత్రంగా కమిటీ కుర్రోళ్లు

### భ్రమయుగం చిత్రానికి ఉత్తమ నటుడిగా మమ్ముట్టి

### 'చందు ఛాంపియన్' చిత్రానికి కార్తీక్ ఆర్యన్‌కు కూడా

### ఉత్తమ చిత్రంగా ఆర్టికల్ 370, ఉత్తమ నటిగా యామీగౌతమ్

### పుష్ప 2, కల్కి, లక్కీ భాస్కర్ చిత్రాలకు పలు విభాగాల్లో అవార్డులు

### జాతీయ చలన చిత్ర పురస్కారాల ప్రకటన

భారతీయ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం శుక్రవారం న్యూఢిల్లీలో ప్రకటించింది. 2024 సంవత్సరానికి గాను ప్రకటించిన ఈ అవార్డులలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి మరోసారి తన నటనతో జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నారు. 'భ్రమయుగం' చిత్రంలో ప్రదర్శించిన అద్భుత నటనకు గాను ఆయన ఉత్తమ నటుడిగా నిలిచారు. ఆయనతో పాటు 'చందు ఛాంపియన్' చిత్రానికి కార్తీక్ ఆర్యన్ కూడా ఈ పురస్కారాన్ని సంయుక్తంగా గెలుచుకున్నారు.

న్యూఢిల్లీ: ఉత్తమ నటిగా బాలీవుడ్ భామ యామీ గౌతమ్ (ఆర్టికల్ 370) ఎంపికయ్యారు. అదే సమయంలో, చిన్న సినిమాగా విడుదలై విమర్శకుల ప్రశంసలతో పాటు బాక్సాఫీస్ వద్ద విజయం సాధించిన 'కమిటీ కుర్రోళ్లు' ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపికైంది. ఈ చిత్రానికి పనిచేసిన పి. రవికుమార్‌కు ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్ అవార్డు లభించడం విశేషం. పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలతో విడుదలై విజయం సాధించిన 'కల్కి 2898 ఏడీ' ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా తరువాయి 2 వ పేజీలో...



# పాస్‌పోర్టు బ్రోకర్!

### సీఎంను చేస్తే నిజాం కంటే ఆస్తిపరుడు అయ్యాడు

### అమెరికాలో దొడ్లు కడిగేవాళ్లకు మంత్రి పదవులు

### కేసీఆర్‌ను గజ్వేల్‌లో రాజకీయ సమాధి చేస్తే

### మేం ఏడాదిలో 70 వేల ఉద్యోగాలిచ్చినం: రేవంత్

హైదరాబాదద్, జూలై 18 (ఈవార్తలు): గతంలో ప్రజలు పాస్‌పోర్ట్ బ్రోకర్‌ను సీఎం ను చేస్తే.. అమెరికాలో దొడ్లు కడిగేవాళ్లకు మంత్రి పదవులు కట్టబెట్టారని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణకు రూ. 8 లక్షల కోట్ల అప్పులిచ్చిన ఘనత గత ప్రభుత్వానిదేనన్నారు. అప్పులు చేసింది నిజం కాకుండా.. నిజాంల కంటే ఆస్తిపరులు ఎలా అయ్యారని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ ను గజ్వేల్ లోనే రాజకీయ సమాధి చేసే బాధ్యత తమదని పునరుద్ఘాటించారు. తెలంగాణ తరువాయి 2 వ పేజీలో...

# స్కాంగ్రెస్

## కొలువులు కాదు.. కుంభకోణాల మేళా

### తెలంగాణలో ధోకేకా మకాన్ నడుస్తోంది.. కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్‌పై కేటీఆర్ ఫైర్

సరూర్‌నగర్-హైదరాబాద్, జూలై 18 (ఈవార్తలు): తెలంగాణలో కుంభ కోణాల కుంభమేళా నడుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్-సరూర్‌న గర్‌లో బీఆర్ఎస్ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సులో ఆయన పాల్గొన్నా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సరిగ్గా 38 నెలల కింద ఇదే సరూర్ నగర్ స్టేడియం సాక్షిగా తెలంగాణ యువత దగా పడిందని తెలిపారు. నిరుద్యోగులను వంచించిన దగాకోరు లు కాంగ్రెస్ నాయకులు అని పేర్కొన్నా రు. హైకమాండ్ తరలివచ్చి మాయా మశ్చీంద్ర తరువాయి 2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,329 |
| వెండి (కిలో): | రూ.2,35,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,934 |

# ఈటల-బండి అలయ్ బలయ్

### ఎంపీ, కేంద్ర మంత్రి మధ్య సయోధ్య!.. ఎంపీ లక్ష్మణ్ నివాసం వేదికగా కీలక పరిణామం

తెలంగాణలో అధికారంలోకి రావాలనే పట్టుదలతో ఉన్న బీజేపీ.. ఆ దిశగా చకచకా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే నేతల మధ్య విభేదాలను తొలగించి.. అందరినీ ఒక తాటిపైకి తీసుకురావాలని ప్లాన్ చేస్తోంది. ఎంతో కాలంగా విభేదాలతో ఎడమొహం పెడమొహంగా ఉంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చారు.



హైదరాబాద్, జూలై 18 (ఈవార్తలు): వీరిద్దరి మధ్య రాజీ కుదిర్చేందుకు రంగంలోకి దిగిన బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్.. శనివారం ఈటల రాజేందర్, బండి సంజయ్‌తో సమావేశం నిర్వహించారు. ఎంపీ లక్ష్మణ్ నివాసం వేదికగా జరిగిన ఈ సమావేశంలో ఈటల, బండి మధ్య రాజీ కుదిర్చారు. విభేదాలు పక్కనపెట్టి.. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చే దిశగా కృషి చేయాలని ఇద్ద రు నేతలకు అభయ్ పాటిల్ దిశానిర్దేశం చేశారు. భేటీ అనంతరం మీడియా ముందుకు బీజేపీ నేతలు.. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే అని ధీమా వ్యక్తం చేశారు. ఈటల, బండి సంజయ్ మధ్య సయోధ్య బీజేపీకి బూస్ట్‌లా పనిచేయనుంది. భవిష్యత్తులో తెలంగాణలో తరువాయి 2 వ పేజీలో...



# సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష భగ్నం

### ఢిల్లీ హైకోర్టు సూచనతో ఆస్పత్రికి తరలింపు

### నా భర్తకు చికిత్స ఇవ్వొద్దు: సోనమ్ భార్య

న్యూఢిల్లీ: సామాజిక వేత్త సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు. ఆయన ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో ఆస్పత్రికి తరలించారు. జూన్ 28 నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టగా, 20 రోజులు దీక్ష పూర్తైంది. ఐతే.. ఆయన ఆరోగ్యం రోజురోజుకూ క్షీణించడంతో ఢిల్లీ హైకోర్టు స్పందించింది. ఆయన ఆరోగ్యాన్ని కాపాడాలని కోరింది. తాను దీక్షను విరమిస్తే, కేంద్రం.. ధర్మేంద్ర ప్రదాన్‌ను రాజీనామా చెయ్యనివ్వదనీ.. అందువల్ల తాను దీక్షను విరమించే ప్రసక్తే లేదని వాంగ్‌చుక్ చెప్పారు. ఈ పరిస్థితుల్లో పోలీసులు ఆయనను ఆస్పత్రికి తరలించారు. అయితే, తన అనుమతి లేకుండా తన భర్తకు ఎలాంటి ట్రీట్మెంట్ చేయొద్దని సోనమ్ వాంగ్ చుక్ - 2 వ పేజీలో...

## విశ్వవాణి



నోటి పరిశుభ్రత కేవలం దంతాలు, చిగుళ్ల ఆరోగ్యానికే కాదు.. మొత్తం శరీర ఆరోగ్యానికీ అత్యంత కీలకమని తాజా పరిశోధనలు సూచిస్తున్నాయి. మన నోటిలో నివసించే కోట్లాది సూక్ష్మజీవుల సముదాయం, శరీరంలోని అనేక వ్యాధులతో సంబంధం కలిగి ఉండొచ్చని శాస్త్రవేత్తలు గుర్తించారు.

# ఐదుగురు జల సమాధి

### గోదావరిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు మృతి

### ఏపీలోని పోలవరం జిల్లాలో తీవ్ర విషాదం

పోలవరం జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. పోలవరం జిల్లాలోని ఎటపాక మండలం గొల్ల గూడెం వద్ద ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. చేపల కోసమని గోదావరి నదిలోకి దిగిన ఐదుగురు.. నీటిలో మునిగి గల్లంతయ్యారు. నదిలో లోతు ఎక్కువగా ఉండటంతో నీట మునిగి ఊపిరాడక మృతి చెందారు.



పోలవరం, జూలై 18 (ఈవార్తలు): సమాచారం అందుకున్న పోలీసులు, సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే అప్పటికే వారంతా ప్రాణాలు కోల్పోయారు. సహాయక చర్యలు చేపట్టిన పోలీసులు ఐదు మృతదేహాలను వెలికి తీశారు. మృతులలో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారు. వీరంతా గొమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఒకేరోజు అనుకోని రీతిలో ఐదుగురు ప్రాణాలు కోల్పోవటంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వారి తరువాయి 2 వ పేజీలో...

# 8 మంది అగ్నికి ఆహుతి

### బాణసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు... గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఘటన

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గల ఓ బాణసంచా ఫ్యాక్టరీలో శనివారం భారీ పేలుడు సంభవించింది. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్వహిస్తున్న ఒక పటాకుల తయారీ కేంద్రంలో జరిగిన ఈ పేలుడు ధాటికి ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో 9 మంది తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. రామోల్-గాత్రాడ్ రోడ్ కెనాల్ సమీపంలోని ఓ బహిరంగ ప్రదేశంలో నడుస్తున్న యూనిట్‌లో ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు.




అహ్మదాబాద్: మొదట ఇద్దరు మాత్రమే మృతి చెందినట్లు వార్తలు వచ్చినప్పటికీ, సహాయక చర్యలు ముమ్మరం చేయడంతో మృతుల సంఖ్య ఎనిమిదికి చేరింది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే రెస్క్యూ టీమ్స్ రంగంలోకి దిగి గాయపడిన కార్మికులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఎల్జీ, సివిల్ ఆసుపత్రులకు తరలించారు. ఈ ఫ్యాక్టరీని మేహుల్ దొడియా అనే వ్యక్తి నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సదరు ఫ్యాక్టరీ లైసెన్స్‌ను అధికారులు ఇదివరకే రద్దు తరువాయి 2 వ పేజీలో...

# 1న భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం

అమరావతి, జూలై 18 (ఈవార్తలు): ఏపీలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ఆగస్టు 1వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా ఈ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాన్ని అధికారికంగా ప్రారంభించనున్నట్లు ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఈ మెగా ప్రాజెక్టు ప్రారంభోత్సవ ఏర్పాట్లపై శనివారం అమరావతిలో ఆయన ఉన్నతాధికారులతో కలిసి ఒక ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రధాని మోడీ చేతుల మీదుగా జరిగే ఈ ప్రారంభోత్సవ వేడుకను ఒక చారిత్రాత్మక ఘట్టంగా, ఉత్తరాంధ్రా ప్రజలందరూ ఒక పండుగలా జరుపుకునేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విమానాశ్రయం ప్రతి అంగుళంలోనూ ఆంధ్రప్రదేశ్ గొప్ప సంస్కృతి, కళలు, గిరిజన సాంప్రదాయాలు, హస్తకళల వైభవం ప్రతిబింబించేలా స్వాగత తోరణాలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.

# రాశి ఫలాలు

19.7.2026

మేషం: వృత్తి వ్యాపార రంగంలో అనుకూలమైన మార్పులు ఉంటాయి. చేపట్టిన ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. అయితే, విలాస వస్తువుల కొరకు ఖర్చులు పెరిగే అవకాశం ఉంది కాబట్టి పొదుపుపై దృష్టి పెట్టండి. కుటుంబంలో ప్రశాంత వాతావరణం నెలకొంటుంది.

వృషభం: వ్యాపార రంగంలో ఉన్నవారికి నూతన పెట్టుబడులు లేదా ఒప్పందాలు అనుకూలిస్తాయి. నిలిచిపోయిన పాత బాకీలు వసూలవుతాయి. ఆరోగ్యం పట్ల కొద్దిగా శ్రద్ధ వహించడం మంచిది. బంధుమిత్రుల రాక ఇంట ఆనందాన్ని ఇస్తుంది.

మిధునం: కార్యాలయంలో పని ఒత్తిడి కొద్దిగా పెరిగినప్పటికీ, సహనంతో పనులను పూర్తి చేస్తారు. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నాయి. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు తొందరపాటు వద్దు. ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది.

కర్కాటకం: సమాజంలో మీ గౌరవ మర్యాదలు పెరుగుతాయి మరియు కీర్తి ప్రతిష్టలు దక్కుతాయి. వ్యాపారంలో ఆశించిన స్థాయిలో మంచి లాభాలు పొందుతారు. జీవితభాగస్వామితో సంతోషంగా గడుపుతారు మరియు మీ మధ్య ఉన్న బంధం మరింత బలపడుతుంది.

సింహం: ఉద్యోగ రంగంలో నూతన అవకాశాలు లభిస్తాయి. పూర్తి ఆత్మవిశ్వాసంతో పనులను ప్రారంభించి సకాలంలో పూర్తి చేస్తారు. కోపాన్ని అదుపులో ఉంచుకోవడం వల్ల సహోద్యోగులతో విభేదాలు రాకుండా చూసుకోవచ్చు. ఆర్థిక పరిస్థితి బాగుంటుంది.

కన్య: దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలు పరిష్కారమవుతాయి. మీ ప్రతిభకు తగిన గుర్తింపు మరియు పై అధికారుల నుండి ప్రశంసలు లభిస్తాయి. ఆర్థికంగా స్థిరత్వం ఉ ంటుంది. పాత స్నేహితులను కలుసుకోవడం మనస్సుకు ఉల్లాసాన్ని ఇస్తుంది.

తుల: ఈరోజు మిశ్రమ ఫలితాలు ఉంటాయి. చేపట్టిన పనులలో కొన్ని చిన్నపాటి ఆటంకాలు ఎదురైనా, ఓర్పుతో వాటిని అధిగమిస్తారు. అనవసర ఖర్చులు పెరగకుండా చూసుకోవాలి. ముఖ్యమైన విషయాల్లో కుటుంబ పెద్దల సలహాలు తీసుకోవడం శ్రేయస్కరం.

వృశ్చికం: ఆకస్మిక ధనలాభ సూచనలు బలంగా ఉన్నాయి. నూతన పరిచయాలు ఏర్పడతాయి. ఇవి భవిష్యత్తులో మీ వ్యాపార అభివృద్ధికి ఎంతగానో తోడ్పడతాయి. శారీరక దృఢత్వం బాగుంటుంది మరియు రోజంతా ఎంతో ఉత్సాహంగా గడుపుతారు.

ధనస్సు: బంధువుల నుండి ఒక శుభవార్త వినే అవకాశం ఉంది. వృత్తి ఉద్యోగాల్లో ఆశించిన పురోగతి స్పష్టంగా కనిపిస్తుంది. ఇంట్లో సంతోషకరమైన వాతావరణం నెలకొంటుంది. దైవదర్శనాలు మరియు ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

మకరం: అనవసర వివాదాలకు మరియు ఇతరుల విషయాలకు దూరంగా ఉండటం ఎంతైనా మంచిది. ఆదాయానికి మించి ఖర్చులు పెరిగే అవకాశం ఉంది కాబట్టి బడ్జెట్ ప్రకారం నడుచుకోండి. ఆహార నియమాల విషయంలో జాగ్రత్త వహించి, ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టండి.

కుంభం: ఇంటాబయట అనుకూలత పెరుగుతుంది. ప్రయాణాలలో కొత్త వ్యక్తుల పరిచయాలు కలుగుతాయి. వ్యాపార ప్రారంభానికి శ్రీకారం చుడతారు. సోదరులతో స్థిరాస్తి వివాదాలలో విజయం లభిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో అధికారుల సహాయ సహకారాలు లభిస్తాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి.

మీనం: చేపట్టిన పనులలో శ్రమ అధికంగా ఉన్న మిత్రుల సహాయ సహకారాలతో పూర్తిచేస్తారు. భూ వివాదాలు పరిష్కారంతో ఊరట పొందుతారు. వాహన క్రయ విక్రయాలలో లాభాలు అందుతాయి. సంతాన విద్యా విషయంలో శు భవార్తలు అందుతాయి. నిరుద్యోగులకు అధికారుల అనుగ్రహంతో నూతన అవకాశాలు లభిస్తాయి.

# స్కైరూట్.. ఆకాశమే హద్దు!

మొదటి పేజీ తరువాయి

ప్రముఖ సంస్థల నుంచి 100 మిలియన్ డాలర్లకు పైగా నిధులను సమీకరించి, భారతదేశపు మొట్టమొదటి స్పేస్ యునికార్న్‌గా గుర్తింపు పొందింది. ప్రభుత్వ సంస్కరణలు, ఇన్-స్పేస్ వంటి సంస్థల పర్యవేక్షణతో దూసుకుపోతున్న భారత ప్రైవేట్ అంతరిక్ష రంగానికి ఈ విజయం ఒక మైలురాయిగా నిలుస్తుంది.

## అడ్డా.. హైదరాబాద్

ఈ చరిత్రాత్మక విజయం వెనుక పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకా అనే ఇద్దరు యువ ఇంజనీర్ల పట్టుదల, మేధస్సు ఉన్నాయి. ఈ విజయంతో, అమెరికా, చైనా తర్వాత సొంతంగా ప్రైవేట్ ఆర్బిటల్ ప్రయోగాన్ని నిర్వహించిన మూడో దేశంగా భారత్ అవతరించింది. సాధారణ విమాన టికెట్ బుక్ చేసుకున్నంత సులభంగా, చౌకగా ఉపగ్రహాలను ప్రయోగించాలనే గొప్ప ఆశయంతో 2018లో పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకా 'స్కైరూట్ ఏరోస్పేస్'ను స్థాపించారు. ఈ సంస్థకు పవన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా, భరత్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా నాయకత్వం వహిస్తున్నారు. మొదటి ప్రయత్నంలోనే ఐఐటీ ప్రవేశ పరీక్షలో విజయం సాధించిన పవన్, ఖరగ్‌పూర్ ఐఐటీలో తన ఇంజనీరింగ్ పూర్తిచేశారు.

ఎందరో టెక్నాలజీ రంగంలో అధిక వేతనాలతో ఉద్యోగాలను ఎంచుకుంటుంటే, పవన్ మాత్రం రాకెట్లపై తనకున్న ఆసక్తితో ఇస్రో వైపు అడుగులు వేశారు. క్యాంపస్ నుంచే నేరుగా ఇస్రోకు ఎంపికై, తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో ఆరేళ్లపాటు పనిచేశారు. భారతదేశపు అత్యంత బరువైన ప్రయోగ వాహనం జీఎస్ఎల్వీ ఎంకే-3 అభివృద్ధిలో కీలక పాత్ర పోషించి, ఇన్నోవేషన్ అవార్డును కూడా గెలుచుకున్నారు. మరో వ్యవస్థాపకుడు నాగ భరత్ డాకా, మద్రాస్ ఐఐటీలో మైక్రోఎలక్ట్రానిక్స్, వీఎల్ఎస్ఐ డిజైన్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశారు. ఇస్రోలో ఫ్లైట్ కంప్యూటర్ ఇంజనీర్‌గా పనిచేసిన అనుభవంతో, భారత ప్రయోగ వాహనాలకు అవసరమైన అనేక ఏవియానిక్స్ మాడ్యూళ్లను రూపొందించారు. ఏవియానిక్స్, సెమీకండక్టర్ టెక్నాలజీలలో ఆయనకున్న నైపుణ్యం స్కైరూట్ రాకెట్ల అభివృద్ధిలో కీలకంగా మారింది. ఇలా ఇద్దరు మిత్రులు తమ ఇస్రో అనుభవాన్ని రంగరించి, సుమారు 1000 మంది నిపుణులతో కూడిన బృందాన్ని నిర్మించి, ఈ అద్భుత విజయాన్ని అందుకున్నారు.

# పాస్‌పోర్టు బ్రోకర్!

మొదటి పేజీ తరువాయి

నుంచి చాలా దోచుకున్నారన్న సీఎం.. గంజికి గతిలేని వారు కూడా బెంజికార్లకు ఓనర్లయ్యారని విమర్శించారు. రాష్ట్రం ఒక తులసివనమని, ఇక్కడ ఒక్క గంజాయి మొక్కను కూడా మొలకెత్తనివ్వమన్నారు. తెలంగాణను దోచుకున్నవారిని అసలే వదిలిపెట్టమన్నారు. నిజాంలకే దిక్కులేదు.. మీరెంత, మీ స్థాయి ఎంతంటూ గత ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. అందెశ్రీ స్మృతివనం భూమిపూజ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పెన్నుల మీద మన్ను కప్పితే అవి గున్నులై మొలకెత్తినట్టు ఆ నిర్బంధం నుండి తెంచుకుని ప్రతిగుడిలో, బడిలో అందెశ్రీ పాట వినిపిస్తుందని అన్నారు. అందెశ్రీ, గద్దర్ లాంటి యుద్ధనౌకలతో పెట్టుకున్నోడు కాలగర్భంలో కలిసిపోతాడని ఆ రోజే చెప్పామన్నారు. అందెశ్రీ.. తన కుటుంబాన్ని నడిపేందుకు కష్టపడినా దొరల మోకాళ్ల వద్ద మోకరిల్లను అని అన్నాడని చెప్పారు. ప్రజలపై ఆధిపత్యం చెలాయించాలని కొందరు చూశారని, తెలంగాణను తమ కుటుంబమే తరతరాలు పాలించాలని భావించారన్నారు. అలాంటి సమయంలోనే అందెశ్రీ లాంటివాళ్లు వచ్చారన్నారు. ఈరోజు మేకతోలు కప్పుకున్న తోడేళ్ల లాంటి వాళు బయటకు వచ్చారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ నోటిఫికేషన్లు ఇస్తే రేవంత్ రెడ్డి ఉద్యోగాలు ఇచ్చారని మాట్లాడుతున్నారని, ఆనాడు మీ చెల్లిని నిజామాబాద్‌లో ఓడిస్తే ఎమ్మెల్సీ ఉద్యోగం ఇచ్చారన్నారు. మీ బంధువు వినోద్ కుమార్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిస్తే ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్‌గా మూడు నెలల్లోనే ఉద్యోగం ఇచ్చారన్నారు. వందల మంది మీ బంధులకు ఉద్యోగాలు ఇచ్చారన్నారు. కానీ యువత ఉద్యోగాల కోసం ఒక్కరోజు కూడా ఆలోచించలేదన్నారు.

# ఐదుగురు జల సమాధి

మొదటి పేజీ తరువాయి

కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు నంద్యాల జిల్లాలోనూ ఇదే తరహా ప్రమాదం చోటుచేసుకుంది. ఉయ్యాలవాడ మండలం బోడెమ్మనూరు సమీపంలో ఉన్న కుందూ నదిలో మునిగి ఇద్దరు మృతి చెందారు. పక్కీర రసూల్ బీ, పక్కీర బీబీ అనే ఇద్దరు మహిళలు.. మేత కోసం గొర్రెలను తోలుకుంటూ కుందూ నది సమీపానికి వెళ్లారు. నది అవతలి వైపున పొలాల్లోకి బయలుదేరారు. ఈ క్రమంలో నది దాటాల్సి వచ్చింది. అయితే కుందూ నది లోతు తెలియని పక్కీర రసూల్ బీ మొదటగా నీళ్లలో దిగారు. నీళ్ల లోతు ఎక్కువగా ఉండటంతో మునిగిపోయారు. ఆమెను కాపాడే ప్రక్రియలో పక్కీర బీబీ కూడా కుందూ నది నీటిలో దిగింది. దీంతో ఇద్దరూ నదిలో మునిగి ఊపిరాడక ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఆళ్లగడ్డ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. ఇద్దరి మృతదేహాలను నదిలో నుంచి వెలికి తీశారు. ఘటనపై ఉయ్యాలవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు ఇద్దరి మృతితో వారి కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. కుటుంబసభ్యులు ఘటనాస్థలికి చేరుకుని గుండెలు పగిలేలా రోదించారు.

# ఈటల-బండి అలయ్ బలయ్

మొదటి పేజీ తరువాయి

బీజేపీని మరింత అధికార దిశగా తీసుకెళ్లేందుకు, గ్రేటర్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ఇద్దరూ కలిసికట్టుగా, వ్యూహాత్మకంగా పనిచేయాలని ఈ భేటీలో నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని.. పాటిల్ ఇరువురికీ సూచించినట్లు సమాచారం. ఈ సందర్భంగా మీడియాతో ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ తీరుతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని, కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందంటూ ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధిపై మోదీ ప్రత్యేక చొరవ చూపారని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారమని ధీమా వ్యక్తం చేశారు.

# సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష భగ్నం

మొదటి పేజీ తరువాయి

సతీమణి గీతాంజలి అన్నారు. తన భర్త ఆరోగ్యంగానే ఉ న్నారని.. ఆయనను ఆకస్మాత్తుగా ఆసుపత్రికి తీసుకురావాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. ప్రస్తుతం తాను సఫ్దర్ జంగ్ ఆసుపత్రిలోనే ఉన్నానని తెలిపారు. తన అనుమతి, గత 20 రోజులుగా అతని ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తున్న వైద్యుల పర్మిషన్ తీసుకోకుండా ఎలాంటి ట్రీట్మెంట్ చేయొద్దని ఆమె పేర్కొన్నారు. ఆర్టికల్ 32 ప్రకారం ఇది రాజ్యాంగం తనకు కల్పించిన హక్కు అని అన్నారు. మరోవైపు.. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా నిపుణుల వైద్య సలహా మేరకు వాంగ్‌చుక్‌ను అత్యవసర వైద్య సంరక్షణ కోసం ఆసుపత్రికి తరలించినట్లు ఢిల్లీ పోలీసులు చెబుతున్నారు. ప్రస్తుతం వాంగ్‌చుక్‌ను ఉంచిన సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ప్రకటన విడుదల చేశారు. "నిరాహార దీక్ష కారణంగా ఆయన బలహీనపడ్డారు. డీహైడ్రేషన్‌కు గురయ్యారు. నిరంతర వైద్యపర్యవేక్షణ, చికిత్స అందిచాల్సిన అవసరం ఉంది" అని వెల్లడించారు. మరోవైపు ఆసుపత్రిలోకి ఫోన్ తీసుకెళ్లేందుకు అనుమతించకపోవడంతో అక్కడి సిబ్బందిపై వాంగ్‌చుక్ భార్య ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య పరీక్షల వివరాల కాపీ ఇవ్వకపోవడానికి కారణం ఏంటని ప్రశ్నించారు.

నిరాహార దీక్షకు దిగిన అభిజీత్ దీప్కే

పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించడంతో ఈ ఉద్యమం ఆగిపోదని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడించారు. ఇక నుంచి తాను నిరవధిక నిరాహార దీక్ష చేస్తానని ప్రకటించారు. 'ఈ రోజు నుంచి దీక్ష ప్రారంభిస్తున్నాను. వెనకడుగు వేయొద్దని మద్దతుదారులకు విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రతి ఒక్కరు జంతర్‌మంతర్‌కు రావాలని కోరుతున్నాను. జులై 20న జరగాల్సిన పాదయాత్రను కొనసాగిస్తాం' అని వెల్లడించారు. దీప్కే తన మద్దతుదారులతో సమావేశం నిర్వహించి ప్రసంగిస్తుండగా.. గుర్తుతెలియని మహిళ వారి సమావేశంలోకి ప్రవేశించి అతనిపై సిరా చల్లింది. దీంతో దీప్కే మద్దతుదారులు మహిళ వైపు ఒక్కసారిగా దూసుకెళ్లడంతో జంతర్ మంతర్ వద్ద కాసేపు గందరగోళం నెలకొంది. అయితే, మహిళ ఎవరు? దాడి వెనుక ఉన్న ఉద్దేశం ఏంటనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు.



# కుర్రోళ్లు విజేతలు!

మొదటి పేజీ తరువాయి

ఎంపికైంది. దీంతో పాటు ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ (నితిన్ జిహానీ చౌదరి) అవార్డును కూడా గెలుచుకుంది. 'పుష్ప 2' చిత్రం కోసం దర్శకుడు సుకుమార్ ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే రచయితగా పురస్కారం అందుకోగా, ఇదే చిత్రానికి దీపాలి నూర్, శీతల్ శర్మ ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్లుగా నిలిచారు. దుల్కర్ సల్మాన్ హీరోగా నటించిన 'లక్కీ భాస్కర్' చిత్రానికి గాను దర్శకుడు వెంకీ అట్లూరి ఉత్తమ సంభాషణల రచయితగా జాతీయ అవార్డును గెలుచుకున్నారు. ఇక '35 ఇది చిన్న కథ కాదు' చిత్రం ఉత్తమ బాలల చిత్రంగా ఎంపికవగా, అందులో నటించిన పలువురు బాల నటులకు కూడా అవార్డులు దక్కాయి. ఈ ఏడాది అవార్డులలో కంటెంట్ ఆధారిత చిత్రాలతో పాటు కమర్షియల్ చిత్రాలు కూడా సత్తా చాటాయి. బాలీవుడ్ చిత్రం 'ఆర్టికల్ 370' ఏకంగా మూడు ప్రధాన పురస్కారాలను కైవసం చేసుకుంది. ఈ చిత్రం ఉత్తమ చిత్రంగా నిలవడమే కాకుండా, ఇందులో అద్భుత నటన కనబరిచిన యామీ గౌతమ్‌ను ఉత్తమ నటి పురస్కారం వరించింది. ఇదే చిత్రానికి శశ్వత్ సచ్‌దేవ్ ఉత్తమ సంగీత దర్శకుడిగా ఎంపికయ్యారు. తమిళ చిత్రం 'అమరన్' పలు సాంకేతిక విభాగాల్లో అవార్డులను గెలుచుకుంది. ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన రాజ్‌కుమార్ పెరియసామి ఉత్తమ దర్శకుడిగా, జి.వి. ప్రకాష్ కుమార్ ఉత్తమ నేపథ్య సంగీత దర్శకుడిగా, ఆర్. కలైవన్నన్ ఉత్తమ ఎడిటర్‌గా నిలిచారు. 'మహారాజా' చిత్రానికి గాను ఆనందు అరసు ఉత్తమ యాక్షన్ డైరెక్టర్‌గా, సచనా నమిదాస్ ఉత్తమ సహాయ నటిగా ఎంపికయ్యారు.

ప్రధాన పురస్కారాల విజేతలు:

ఉత్తమ చిత్రం: ఆర్టికల్ 370

ఉత్తమ నటులు: మమ్ముట్టి (భ్రమయుగం), కార్తీక్ ఆర్యన్ (చందు ఛాంపియన్)

ఉత్తమ నటి: యామీ గౌతమ్ (ఆర్టికల్ 370)

ఉత్తమ దర్శకుడు: రాజ్‌కుమార్ పెరియసామి (అమరన్)

ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రం: కల్కి 2898 ఏడీ

ప్రాంతీయ భాషల్లో ఉత్తమ చిత్రాలు:

తెలుగు: కమిటీ కుర్రోళ్లు

తమిళం: రాయన్

హిందీ: శ్రీకాంత్

మలయాళం: ఫెమినా ఫాతిమా

కన్నడ: మిథ్య

# 8 మంది అగ్నికి ఆహుతి

మొదటి పేజీ తరువాయి

చేసినప్పటికీ, నిబంధనలను బేఖాతరు చేస్తూ గుట్టుచప్పుడు కాకుండా పటాకుల తయారీ సాగిస్తున్నట్లు విచారణలో తేలింది. ప్రస్తుతం ఫైర్ ఇంజన్లు రంగంలోకి దిగి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చాయని, పరిస్థితి ప్రస్తుతం అదుపులోనే ఉందని అధికారులు వెల్లడించారు. ఘటనా ప్రాంతంలో సహాయక చర్యలు కొనసాగుతుండగా.. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు చెప్తున్నారు. కాగా.. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పేలుడుకు గల ఖచ్చితమైన కారణాలను తెలుసుకోవడానికి, భద్రతా ప్రమాణాల ఉల్లంఘనలను పరిశీలించడానికి ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ బృందాలతో పాటు ఇతర దర్యాప్తు సంస్థలను కూడా ఘటనా స్థలానికి రప్పించి విచారణ జరుపుతున్నారు. ప్రమాదంలో మరణించిన, గాయపడిన వారి కుటుంబాలకు కేంద్రప్రభుత్వం ఎక్స్ గ్రేషియా ప్రకటించింది. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, గాయపడినవారికి రూ.50వేలు ఎక్స్ గ్రేషియా అనౌన్స్ చేసింది.

# స్కాంగ్రెస్



మొదటి పేజీ తరువాయి

కార్యక్రమం ఇక్కడ చేశారని ఎద్దేవా చేశారు. యూత్ డిక్లరేషన్ పేరిట దుర్మార్గమైన వాగ్దానాల వరద పాటించారని మండిపడ్డారు. పాత కేటుగాళు.. కొత్త డూప్లికేట్లు వచ్చి యువతపై లేని ప్రేమను కనబరిచారని తెలిపారు. యూత్‌కు ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చారా అని నిలదీశారు. ప్రైవేటు కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్ వచ్చిందా అని అడిగారు. కాలేజీ విద్యార్థినులకు స్కూటీలు వచ్చాయా? యువతకు రూ.10లక్షల రుణాలు వచ్చాయా? ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వచ్చాయా? అని ప్రశ్నించారు. నాలుగు ట్రిపుల్‌ఐటీలు, మూడు యూనివర్సిటీలు వచ్చాయా? నెలకు రూ.4వేల భృతి వచ్చిందా? పదో తరగతిలో రూ.10వేలు, ఇంటర్ పాసైతే రూ.15వేలు వచ్చాయా? డిగ్రీ ఉత్తీర్ణులతై లక్ష వచ్చాయా? పీహెచ్‌డీ పాసైతే రూ.5లక్షలు వచ్చాయా? అని ప్రశ్నించారు. ఇంత మోసానికి పాల్పడిన వారిని ఏమనాలో ఆలోచించాలని సూచించారు. దగుల్బాజీలా.. దోకేబాజ్‌లు అనాలో మీరే ఆలోచించాలన్నారు. జిత్తులమారి ముసలి నక్క కాంగ్రెస్ యువజనాన్ని తెలివిగా చిత్తు చేసిందని కేటీఆర్ విమర్శించారు. 60 ఏళ్లు నెత్తురు మరిగిన కాంగ్రెస్ యువతను ఎలా మోసం చేసిందో గుర్తించాలన్నారు. కాంగ్రెస్ మోసపు వలలో పడిపోయి గోసపడుతున్నారని తెలిపారు. 31 నెలలు గడిచాయి.. నిరుద్యోగులకు కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. మాటతప్పి వంచించి, నమ్మించి నట్టేట ముంచి అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. యువతరంతో పెట్టుకుంటే కొన్ని తరాలు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు.

రాహుల్‌కు తెలుగు రాదు.. మన బాధ తెల్వదు

ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తానని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తప్పారని కేటీఆర్ తెలిపారు. రాహుల్ గాంధీకి తెలుగు రాదు.. మన బాధ తెల్వదు అని అన్నారు. అశోక్‌నగర్‌లో చాయ్‌పే చర్చా పెట్టింది అసలు రాహుల్‌గాంధీకి గుర్తుందా? అని ప్రశ్నించారు. యువత తలరాత మారుస్తానని అబద్ధపు హామీలు ఇచ్చారని.. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీశారు. డిగ్రీ విద్యార్థినులకు స్కూటీలు ఏమయ్యాయి? విద్యా భరోసా ఏమైందని అడిగారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయని.. తెలంగాణలో లూటీ జరుగుతోందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోందని ఆరోపించారు. కొలువుల కుంభమేళా అని చెప్పి.. కుంభకోణాల కుంభమేళా చేస్తున్నారని మండిడ్డారు. ఉద్యోగాలు అడిగితే ఉరికించి కొడుతున్నారని కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ మండిపడ్డారు. డిసెంబర్ 9 నుంచి ఉద్యోగ పర్వం కాదు.. ఉన్మాదపర్వం చూపిస్తున్నారని అన్నారు. నిరుద్యోగుల పట్ల దౌర్జన్య కాండ కొనసాగుతోందని తెలిపారు. రాహుల్ గాంధీకి నిరుద్యోగుల ఆక్రోశం కనబడటం లేదా అని నిలదీశారు. నిరుద్యోగ అభ్యర్థుల శోకాలు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. సిటీ సెంట్రల్ లైబ్రరీలో దాడులు, ఓయూలో నిర్బంధాలు కనిపించడం లేదా అని అడిగారు. ఢిల్లీలో రాజ్యాంగం చేత పట్టుకుని రాహుల్ గాంధీ సుద్దపూస మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్ నడిబొడ్డున ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే పట్టించుకునే వారే లేరని కేటీఆర్ మండిపడ్డారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే వరకు వదిలిపెట్టనని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని తెలిపారు. నవంబర్ 22న అవినీతి సొమ్ముతో జాబ్ క్యాలెండర్‌పై యాడ్‌లు వేశారని గుర్తుచేశారు. కానీ ఇవాళ జాబులు లేవు.. జవాబులు లేవని విమర్శించారు. ఉద్యోగాలు లేవు.. క్యాలెండర్ మారినా.. జాబ్ క్యాలెండర్‌కు దిక్కు లేదని అన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ చిత్తు కాగితాలుగా మారిందని విమర్శించారు. చరిత్రను మరిచిపోతే భవిష్యత్ తరాలు క్షమించవని హెచ్చరించారు. చరిత్రలు, ఇతిహాసాలు, పురాణాలు చదవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. తెలంగాణ ఉద్యమాల్లో చావగొట్టిన వాళ్లే మళ్లీ అధికారంలోకి వస్తారని తెలిపారు. కాంగ్రెస్ అలవిగాని హామీలు నమ్మి తెలంగాణ యువత మోసపోయింద్రు అని తెలిపారు. 1952, 1969లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ యువత గుండెల్లో గునపాలు నింపిందని గుర్తుచేశారు. వేలమంది యువత ప్రాణాలు తీసుకున్నా కాంగ్రెస్‌కు రక్తదాహం తీరడం లేదని అన్నారు. మన రక్తం పొలాల మీద చల్లాలని చిల్లరమాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతు, యూత్, మహిళ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని తెలిపారు. ఓటు కోసం కోటి మోసాలు చేస్తున్న కాంగ్రెస్ తీరు దేశానికి తెలియాలన్నారు.



# ఆశ్రమంలో గంజాయి సాగు

## ములుగు జిల్లాలో సాధువు అరెస్ట్

ములుగు, జూలై 18 (ఈవార్తలు): ఆధ్యాత్మిక కేంద్రం ముసుగులో గంజాయి సాగు చేస్తున్న సాధువును పోలీసులు అరెస్ట్ చేశారు. ములుగు జిల్లా తాండూరు మండలంలోని ఒక ఆశ్రమంలో ఈ ఘటన వెలుగుచూసింది. కాశీకి చెందిన శ్రీరామ్ గిరి అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు గోవిందరావుపేటలోని ఆశ్రమంపై మెరుపు దాడి చేశారు. ఆశ్రమ ప్రాంగణంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించగా, అక్రమంగా సాగు చేస్తున్న 36 గంజాయి మొక్కలు బయటపడ్డాయి. వాటిని వేర్లు సహా స్వాధీనం చేసుకున్న పోలీసులు, అక్కడే లభించిన కొంత ఎండిన గంజాయిని కూడా సీజ్ చేశారు. నమూనాలను తదుపరి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. నిందితుడైన శ్రీరామ్ గిరి తన సోదరితో కలిసి ఈ ఆశ్రమంలో నివసిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల పేరుతో స్థానికులను నమ్మిస్తూ, చాటుగా గంజాయి సాగు చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. నిందితుడిపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు ముమ్మరం చేసినట్లు అధికారులు వివరించారు. పవిత్రమైన ఆశ్రమంలో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు సాగడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

# కన్నబిడ్డను అమ్మి.. కిడ్నాప్ నాటకం

## మహబూబ్‌నగర్‌లో 15 రోజుల పసికందు అమ్మకం

మహబూబ్‌నగర్, జూలై 18 (ఈవార్తలు): కన్నబిడ్డను లక్ష రూపాయలకు విక్రయించి, ఆపై శిశువు కిడ్నాప్‌నకు గురైనట్లు నాటకమాడిన అమానవీయ ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో కలకలం రేపింది. మహబూబ్‌నగర్ రూరల్ మండలం, తెలుగుగూడెం ప్రాంతానికి చెందిన కేశవులు, నీలమ్మ దంపతులకు 15 రోజుల క్రితం శిశువు జన్మించింది. అయితే, జూలై 13న తాము బయటకు వెళ్లిన సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు బిడ్డను అపహరించుకుపోయారని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన ఐసీడీఎస్ అధికారులకు తల్లిదండ్రుల ప్రవర్తనపై అనుమానం కలగడంతో, వారు పోలీసులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో పోలీసులు తమదైన శైలిలో విచారణ జరపగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. బిడ్డ కిడ్నాప్ అవలేదని, తల్లిదండ్రులే స్వయంగా తరుణ్, భీమయ్య అనే ఇద్దరు వ్యక్తులకు లక్ష రూపాయలకు శిశువును విక్రయించినట్లు తేలింది. దీంతో పోలీసులు తరుణ్, భీమయ్యలపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 137 కింద కేసు నమోదు చేశారు. వారిద్దరూ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపిన అనంతరం బిడ్డ తల్లిదండ్రులు కేశవులు, నీలమ్మలపై కూడా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

# ఎల్‌నినోపై నిపుణుల కమిటీ

## కమిటీ ఛైర్మన్‌గా జి.చిన్నారెడ్డి నియామకం


హైదరాబాద్, జూలై 18 (ఈవార్తలు): ఎల్‌నినోపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రస్థాయి నిపుణుల కమిటీ ఏర్పాటు చేసింది. కమిటీ ఛైర్మన్‌గా జి.చిన్నారెడ్డిని నియమించింది. కమిటీ కన్వీనర్‌గా వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఉంటారు. ఎల్‌నినో ప్రభావంపై కమిటీ అంచనా వేయనుంది. కరవు నివారణ చర్యలపై కమిటీ సిఫార్సులు చేయనుంది. మరోవైపు, శనివారం విద్యుత్ శాఖపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించిన వేళ ఎల్‌నినో సవాళ్లపై ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వర్షాభావంతో పెరిగే విద్యుత్ డిమాండ్‌కు సిద్ధంగా ఉండాలని చెప్పారు. నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని అధికారులకు ఆదేశించారు. తాగునీరు, సాగు నీటికి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ పంపిణీలో ఏఐ వినియోగాన్ని విస్తరించాలని ఆదేశించారు. డీటీఆర్ మ్యాపింగ్‌ను గడువులోగా పూర్తి చేయాలని చెప్పారు.



# ఏపీలో రానున్న 5 రోజులు వర్షాలు

కోస్తా తీరం వెంబడి గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో గాలులు

విశాఖపట్నం, జూలై 18 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో రానున్న ఐదు రోజుల పాటు వాతావరణం మేఘావృతమై ఉంటుందని, పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. కోస్తాంధ్ర తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఆదివారం (జులై 19) పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన వివరించారు. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, పోలవరం, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, కడప జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు పడతాయని పేర్కొన్నారు. మిగిలిన జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉ ందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రఖర్ జైన్ సూచించారు. ఉరుములు, మెరుపులతో వర్షం పడుతున్నప్పుడు, బలమైన గాలులు వీచే సమయంలో చెట్ల కింద, పెద్ద హోర్డింగుల సమీపంలో నిలబడటం సురక్షితం కాదని హెచ్చరించారు. సముద్రం అలజడిగా ఉండే అవకాశం ఉన్నందున, చిన్న బోట్లు ఉపయోగించే మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని, జాగ్రత్తగా ఉండాలని కోరారు.



# రాష్ట్రంలో గుడిసెలు లేకుండా చేస్తాం

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడి.. ప్రతి పేదకు పక్కా ఇల్లు అందిస్తామని హామీ

పరిగి, జూలై 18 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్రంలో గుడిసెలు అనేవే లేకుండా చేస్తామని, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత పక్కా ఇల్లు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందని ఆయన కొనియాడారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో రూ.184.15 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న రోడ్ల అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పరిగి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు కీలక వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు లేని పేద ప్రజలు సొంతంగా పక్కా ఇంటిని నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని కోమటిరెడ్డి తెలిపారు. త్వరలోనే అర్హులైన మిగతా వారందరికీ ఇళ్లు ఇచ్చేందుకు రెండో విడత కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు. వికారాబాద్ జిల్లాలో రోడ్ల నెట్‌వర్క్ బలోపేతం కోసం రూ.900 కోట్ల నిధులు మంజూరు చేయించామని, అందులో నుంచే పరిగి నియోజకవర్గానికి రూ.184.15 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రవాణా వ్యవస్థ మెరుగైతేనే పరిశ్రమలు వచ్చి స్థానిక యువతకు ఉపాధి పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి తీరుతామని మాట ఇచ్చిన మంత్రి కోమటిరెడ్డి... నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులతో పాటు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమ పథకాలను విజయవంతంగా కొనసాగిస్తున్నామని వివరించారు.

# బహదూర్‌గూడలో రైతాగ్రహం

**పోలీసులపై కారంచల్లిన అన్నదాతలు**

**600 ఎకరాల భూముల స్వాధీనానికి వ్యతిరేకత**

**ఐదు రోజులుగా రైతుల ఆందోళన కొనసాగింపు**



శంషాబాద్, జూలై 18 (ఈవార్తలు): రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం భూసేకరణ వ్యవహారం మరోసారి ఉద్రిక్తతకు దారితీసింది. భూములు స్వాధీనం చేసుకునేందుకు అధికారులు వెళ్లగా రైతులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆగ్రహానికి గురైన కొందరు రైతులు పోలీసులపై కారం చల్లి, రాళ్లు, కుర్చీలు విసురుతూ దాడికి దిగారు. ఈ ఘటనలో పలువురు కానిస్టేబుళ్లు, ఎస్ఐలు, సీఐలకు గాయాలయ్యాయి. గాయపడిన అధికారులకు చికిత్స అందించారు. డీసీపీకి కూడా గాయాలైనట్టు తెలుస్తోంది. ఈ ఘటటనతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం సుమారు 600 ఎకరాల భూమిని సేకరించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. అయితే తమ భూములను ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వబోమంటూ రైతులు ఐదు రోజులుగా నిరసన కొనసాగిస్తున్నారు. తమకు స్పష్టమైన హామీ ఇచ్చిన తర్వాతే భూసేకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. భూముల స్వాధీన ప్రక్రియ కోసం శనివారం ఉదయం హైడ్రా అధికారులు భారీ బందోబస్తుతో అక్కడికి చేరుకున్నారు. అధికారులు ముందుకు సాగేందుకు ప్రయత్నించగా రైతులు అడ్డుకున్నారు. ఉదయం మొదలైన ఉద్రిక్తత సాయంత్రానికి మరింత తీవ్రరూపం దాల్చింది. పరిస్థితి చేదాటడంతో డీసీపీ యోగేశ్ గౌతమ్ రంగంలోకి దిగారు. వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఇది ఆరంభం మాత్రమేనని, చర్చలు జరిపిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా కలెక్టర్‌కు విన్నవించుకునే అవకాశం కల్పిస్తారని చెప్పారు. రైతుల అనుమతి లేకుండా ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోబోరని హామీ ఇచ్చారు. అయినప్పటికీ.. రైతులు వెనక్కి తగ్గలేదు. నిరసన కొనసాగిస్తామని భీష్మించారు.

## మహిళను వివస్త్రను చేసి దాడి..

# మానవత్వానికే మచ్చ: జగన్



గుంటూరు, జూలై 18 (ఈవార్తలు): ఏపీలోని గుంటూరులో ఒక మహిళను వివస్త్రను చేసి, టీడీపీ నాయకుడు దాడికి పాల్పడిన ఘటన మానవత్వానికే మచ్చ అని, రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణ ఎంత ఘోరంగా విఫలమైందో చెప్పడానికి ఇది నిలువెత్తు నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ మండిపడ్డారు. ఈ దారుణానికి చంద్రబాబు ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని ఆయన విమర్శించారు. ఈ ఘటన బుధవారమే జరిగినా, మూడు రోజులపాటు దానిని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారని, చివరకు ఆ వీడియోలు సోషల్ మీడియాలో బయటకు వచ్చి రాష్ట్ర ప్రజలంతా ఈ పరిపాలనను అసహ్యించుకున్న తర్వాతే ప్రభుత్వం స్పందించిందని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పుడు తానేదో గొప్పగా చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు హడావుడి చేయడం మరింత సిగ్గుచేటని అన్నారు. ఆ వీడియోలను కప్పిపుచ్చడంపై చూపిన శ్రద్ధను నిందితులను పట్టుకోవడంపై చూపలేదని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తనపై తొలిసారి దాడి జరిగిన వెంటనే బాధితురాలు పోలీసులను ఆశ్రయించినప్పుడు వారు స్పందించి ఉంటే, ఆ తర్వాత ఇంతటి ఘోరం జరిగేది కాదు కదా అని ప్రశ్నించారు. ఆమె ఫిర్యాదుపై వెంటనే కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకుని ఉంటే ఈ దారుణం జరిగేదా? అని నిలదీశారు. ఫిర్యాదు చేసిన మహిళకు రక్షణ కల్పించకుండా మౌనం వహించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. “అసలు పోలీస్ స్టేషన్లు ఉన్నది ఎందుకు? బాధితుల ఫిర్యాదులను స్వీకరించడానికా? లేక అధికార పార్టీ నాయకులు ఏం చెబితే అది చేయడానికా? బాధితురాలికి అండగా నిలవకపోగా, పంచాయితీలు చేయడానికి ప్రయత్నిస్తారా? వీడియోలు బయటకు వస్తేనే చట్టం మేల్కొంటుందా? బాధితురాలి ఫిర్యాదుకు విలువ లేదా? నేరం జరుగుతున్నప్పుడు స్పందించకుండా, ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికిన తర్వాత చర్యల పేరుతో నాటకాలు ఆడటం ఏ రకమైన పోలీసింగ్? రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై ఈ చంద్రబాబు ప్రభుత్వం కావాలనే దాడులను ప్రోత్సహించింది. ఆ అరాచకాలను కప్పిపుచ్చడానికి పోలీసు వ్యవస్థను ఒక రాజకీయ ఆయుధంగా మార్చుకుంది. చట్టాన్ని అధికార పార్టీకి చుట్టంగా, ప్రతిపక్షాలపై వేధింపులకు, అక్రమ కేసులకు ఒక సాధనంగా మార్చి రాష్ట్రాన్ని జంగిల్‌రాజ్‌గా దిగజార్చింది” అని ఆయన తీవ్రంగా విమర్శించారు. అధికార పార్టీ నాయకులు ఏం చేసినా పోలీసులు రక్షిస్తారనే ధైర్యం ఈ రెడ్‌బుక్‌పాలనలో గ్రామాలు, వార్డుల స్థాయి వరకూ పాకిందని జగన్ అన్నారు. అందుకే టీడీపీ కూటమికి చెందిన పలువురు నాయకులు దుశ్శాసనుల్లా తయారయ్యారని మండిపడ్డారు. ఎలాంటి దారుణాలు చేసినా, ముఖ్యంగా మహిళలపై దాడి చేసినా, తమను కాపాడటానికి చంద్రబాబు ఉన్నారనే ధైర్యం వారిలో పెరిగిపోయిందని ధ్వజమెత్తారు. ఈ పరిస్థితి రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా చేసిందని జగన్ ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల దురాగతాల నుంచి తమను తాము కాపాడుకోవాల్సిన దుస్థితికి మహిళల చేరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. “చంద్రబాబు గారూ, ఇదేనా మీరు చెప్పే మహిళా భద్రత? ఇదేనా మీ సుపరిపాలన? ఇదేనా మీ పోలీసింగ్? మహిళల ఆగ్రహమే మీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతుంది” అని ఆయన హెచ్చరించారు.

# శ్రీవారి సేవలో పవన్ భార్య.. రూ.17 లక్షల విరాళం

తిరుమల, జూలై 18 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భార్య అన్నా లెజినోవా తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ ఉదయం సుప్రభాత సేవలో పాల్గొన్న ఆమె, అలిపిరి నుంచి నడకమార్గంలో తిరుమల చేరుకున్నారు. నిన్న రాత్రి తిరుమల చేరుకున్న ఆమెకు టీటీడీ అధికారులు స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దర్శన అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఇటీవల పవన్ భుజానికి శస్త్రచికిత్స జరిగిన నేపథ్యంలో ఆమె తిరుమల చేరుకుని మొక్కు తీర్చుకున్నారు. ఆమె తన కుమారుడు మార్క్ శంకర్ పేరుతో శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.17 లక్షలు విరాళం అందజేశారు. తిరుమలలో భక్తులకు అన్నప్రసాదం పంచారు. భక్తులతో కలిసి అన్నప్రసాదం స్వీకరించారు. అన్నా లెజినోవా రష్యా దేశానికి చెందినవారు. ఆమె పవన్ కళ్యాణ్‌ను వివాహం చేసుకున్న తర్వాత హిందూ ఆచారాలను అనుసరిస్తున్నారు. హిందూ సంప్రదాయం ప్రకారం ఆమె సిందూరాన్ని ధరిస్తారు. మరోవైపు, పవన్ హైదరాబాద్ లోని తన నివాసంలో ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి ‘ఈవార్తలు’ నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి ‘ఈవార్తలు’. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## టీ-హబ్ బేబీ ‘స్కైరూట్’

# కొత్త చరిత్ర: కేటీఆర్



హైదరాబాద్, జూలై 18 (ఈవార్తలు): హైదరాబాద్ సరూర్ నగర్ వేదికగా జరిగిన ‘యువ సంగ్రామ సదస్సు’లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం నమోదైన కీలక అంతరిక్ష విజయాన్ని పంచుకున్నారు. దేశంలోనే తొలిసారిగా శ్రీహరికోట నుంచి ప్రైవేట్ రాకెట్ ‘విక్రమ్-1’ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ అద్భుత రికార్డు సృష్టించిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ మరెక్కడో కాదు.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన ‘టీ-హబ్’ వేదికగానే పురుడు పోసుకుందని గర్వంగా ప్రకటించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు పూర్తయిన తరుణంలో... దేశ చరిత్రలోనే సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ ఒక ప్రైవేట్ రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపిన ఘనత స్కైరూట్ కంపెనీకే దక్కుతుందని కేటీఆర్ కొనియాడారు. మన హైదరాబాద్‌లోని టీ-హబ్ వేదికగా స్టార్టప్‌గా ప్రస్థానం మొదలుపెట్టిన ఒక సంస్థ, ఇవాళ ప్రపంచ స్థాయిలో దేశం గర్వించేలా ఎదగడం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. శ్రీహరికోట సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ ప్రయోగం అత్యంత విజయవంతంగా ముగిసిందని కేటీఆర్ తెలిపారు. ఈ చరిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించిన స్కైరూట్ టీమ్‌కు సభకు హాజరైన నిరుద్యోగ యువత, విద్యార్థులంతా చప్పట్లతో ఘనంగా అభినందనలు తెలపాలని అన్నారు. మరోవైపు, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో సహకారంతో ప్రైవేట్ రంగానికి చెందిన తొలి దేశీయ రాకెట్ ప్రయోగం సక్సెస్ కావడంతో... అటు ఇస్రో సైంటిస్టులతో పాటు ఇటు స్కైరూట్ కంట్రోల్ సెంటర్‌లోనూ పండుగ వాతావరణం నెలకొంది.

# రావణ్ రిమాండ్ పొడిగింపు

గన్నవరం, జూలై 18 (ఈవార్తలు): వివాదాస్పద సోషల్ మీడియా పోస్టులు, దేశద్రోహం కేసులో అరెస్ట్ అయిన ప్రశ్న రావణ్ అలియాస్ బచ్చులకూరి జోసెఫ్ జ్యుడీషియల్ రిమాండ్‌ను గన్నవరం న్యాయస్థానం మరో 14 రోజుల పాటు పొడిగించింది. ప్రస్తుతం నెల్లూరు జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న జోసెఫ్ గడువు ముగియడంతో, జైలు అధికారులు అతడిని వర్చువల్ విధానంలో న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టారు. కేసు తీవ్రతను పరిశీలించిన కోర్టు, రిమాండ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కేసు వివరాల్లోకి వెళితే... సమాజంలోని పలువురు ప్రముఖుల వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం, ఆ వీడియోలను సోషల్ మీడియా వేదికగా వైరల్ చేయడంతో జోసెఫ్‌పై గతంలోనే పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. అయితే, ఈ అరెస్ట్ అనంతరం అతడి వ్యక్తిగత మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని పరిశీలించగా, మరికొన్ని షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వ నిషేధిత గ్రూపులైన మావోయిస్టుల సిద్ధాంతాలను సమర్థిస్తూ రావణ్ ప్రత్యేకంగా వీడియోలు రూపొందించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ డిజిటల్ ఆధారాలతో కేసు తీవ్రత పూర్తిగా మారిపోయింది. దేశ సార్వభౌమాధికారానికి విఘాతం కలిగించేలా వ్యవహరించినందుకు గానూ అతడిపై దేశద్రోహం కేసుతో పాటు, అత్యంత కఠినమైన చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద అదనపు సెక్షన్లను నమోదు చేసి విచారణను వేగవంతం చేశారు.

Page-4_Layout 1 7/19/2026 3:36 AM Page 1





## జగన్నాథ రథయాత్రలో డాక్టర్ భోగ శ్రావణి

జగిత్యాల టౌన్, జూలై 18 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ జగన్నాథ స్వామి రథయాత్రలో బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బోగ శ్రావణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం స్వామివారి రథయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శ్రీ జగన్నాథ స్వామివారి దివ్య ఆశీస్సులతో జగిత్యాల అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించినట్లు తెలిపారు. రైతుల పొలాలు సస్యశ్యామలంగా పండిపంటలతో కళకళలాడాలని, యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభించాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ధర్మం, భక్తి, ఐకమత్యానికి ప్రతీకగా నిలిచే ఈ పవిత్ర రథయాత్ర ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సౌభాగ్యం, సుభిక్షాన్ని నింపాలని శ్రీ జగన్నాథ స్వామిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జగిత్యాల పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, 5వ వార్డు కౌన్సిలర్ వేముల శ్రీనివాస్, 42వ వార్డు కౌన్సిలర్ నిమ్మల నాగరాజు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, మ్యాదరి అశోక్, సిరిపురం శ్రీనివాస్, ఆముద రాజు, వీరబత్తిని అనిల్‌కుమార్, కొంఢ్ర రవితేజ, సింగం పద్మ, చెన్నది మధురిమ, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



## అమర్‌నాథ్ యాత్ర తాత్కాలిక రద్దు

శ్రీనగర్: హిందువుల అత్యంత పవిత్రమైన అమర్‌నాథ్ యాత్రకు తాత్కాలికంగా బ్రేకులు పడ్డాయి. అమర్‌నాథ్ యాత్ర మార్గంలో ప్రస్తుతం పూర్తి ప్రతికూల పరిస్థితులు ఉండటం వల్ల జమ్మూ కాశ్మీర్ పోలీస్ యంత్రాంగం, శ్రైన్ బోర్డు కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. హిమాలయాల్లో ఒక్కసారిగా మారిన ప్రతికూల వాతావరణం కారణంగా యాత్రను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు వెల్లడించాయి. అమర్‌నాథ్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటం, మంచు కొండల్లో కొండచరియలు విరిగిపడే ప్రమాదం పొంచి ఉండటంతో.. జూలై 19 (ఆదివారం) నుండి యాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. భక్తుల భద్రత దృష్ట్యా బాల్‌టాల్, పహల్‌గామ్ బేస్ క్యాంపుల నుంచి ఎవరినీ ముందుకు వెళ్లకుండా నిలిపివేశారు. వాతావరణం అనుకూలించి, మార్గాలు సురక్షితంగా మారిన తర్వాతే యాత్రికులను అనుమతిస్తామని యంత్రాంగం స్పష్టం చేసింది. కాగా భద్రతా కారణాల రీత్యా ఈ ఏడాది అమర్‌నాథ్ యాత్రా మార్గాల్లో గగనతల రాకపోకలపై కఠిన ఆంక్షలు విధించారు. పహల్‌గామ్, బాల్‌టాల్ రూట్లను “నో–ఫ్లై జోన్”గా కేంద్ర రక్షణ శాఖ ముందుగానే ప్రకటించిన సంగతి తెలిసిందే. జూలై 3న ప్రారంభం అయిన అమర్‌నాథ్ యాత్ర ఆగస్టు 28 తో ముగియనుండగా.. వాతావరణం అనుకూలించకపోవడంతో తాత్కాలికంగా యాత్రను నిలిపివేశారు.

## దేవెగౌడ భార్య చెన్నమ్మ కన్నుమూత

బెంగళూరు: మాజీ ప్రధాని హెచ్.డి. దేవెగౌడ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన భార్య చెన్నమ్మ (80) శనివారం కన్నుమూశారు. బెంగళూరులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, తీవ్ర గుండెపోటుతో ఆమె తుదిశ్వాస విడిచారు. శ్వాసకోశ సంబంధిత సమస్యల కారణంగా చెన్నమ్మ బుధవారం రాత్రి బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చేరారు. ఆమె ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతున్నట్లు కనిపించినప్పటికీ, శనివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మరణించినట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఆ సమయంలో ఆమె భర్త దేవెగౌడ, కుమారుడు, కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామితో పాటు ఇతర కుటుంబ సభ్యులు ఆసుపత్రిలోనే ఉన్నారు. 1954లో దేవెగౌడతో చెన్నమ్మ వివాహం జరిగింది. వీరికి నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిలో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి, ఎమ్మెల్యే హెచ్.డి. రేవణ్ణ సుపరిచితులు. తన భర్త ఎమ్మెల్యే స్థాయి నుంచి దేశ ప్రధాని పీఠం అధిరోహించినా, చెన్నమ్మ మాత్రం ఎప్పుడూ రాజకీయాలకు, ప్రచారానికి దూరంగా ఉంటూ నిరాడంబర జీవితాన్నే గడిపారు. హసన్ జిల్లాకు చెందిన ఒక సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆమె, తన పూర్తి సమయాన్ని కుటుంబ బాధ్యతలకే అంకితం చేశారు. తన రాజకీయ ప్రస్థానంలో ఆమె అందించిన అండదండలు, త్యాగాల గురించి దేవేగౌడ పలు సందర్భాల్లో గుర్తుచేసుకున్నారు. 2001లో హసన్‌లోని తమ స్వగ్రామంలో కుటుంబ కలహాల నేపథ్యంలో జరిగిన యాసిడ్ దాడి నుంచి ఆమె తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. చెన్నమ్మ మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

## ఆర్మీ సాయంతో 30 మందికి నీట్ ర్యాంకులు

### అసోం విద్యార్థులకు ఉచిత నీట్ కోచింగ్

గౌహతి: భారత సైన్యం అందించిన తోడ్పాటుతో అసోంలోని 30 మంది నిరుపేద విద్యార్థులు వైద్య విద్యకు బాటలు వేసుకున్నారు. సైన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ ప్రోగ్రామ్ ద్వారా వీరంతా నీట్–యూజీ 2026 పరీక్షలో అర్హత సాధించారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ప్రతిభావంతులు సాధించిన ఈ విజయం ఇతరులకు గొప్ప స్ఫూర్తిగా నిలిచింది. నేషనల్ ఇంటిగ్రిటీ అండ్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (ఎన్ఐఈడీఓ) వంటి భాగస్వామ్య సంస్థల సహకారంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఇందులో భాగంగా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఏడాది పాటు ఉచిత శిక్షణతో పాటు వసతి, భోజన సౌకర్యాలను కల్పించారు. ఈశాన్య రాష్ట్రాల్లో విద్యావకాశాలను మెరుగుపరిచేందుకు భారత సైన్యం చేపడుతున్న విశేష కార్యక్రమాల్లో ఇది ఒకటి. ఇటీవల విడుదలైన నీట్–యూజీ 2026 ఫలితాల్లో అసోం నుంచి మొత్తం 18,435 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. గతేడాదితో (19,809) పోలిస్తే ఇది దాదాపు 7 శాతం తక్కువని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉత్తీర్ణత శాతం తగ్గుముఖం పట్టినప్పటికీ, సైన్యం ఆధ్వర్యంలో నడిచిన ఈ కోచింగ్ సెంటర్‌లో 100 శాతం ఉత్తీర్ణత నమోదు కావడం గమనార్హం. తీన్‌సుకియా జిల్లాకు చెందిన ఒక రైతు కుమారుడు ఈ శిక్షణ ద్వారా 610 మార్కులు సాధించి, జాతీయ స్థాయిలో 7,320వ ర్యాంకును కైవసం చేసుకోవడం ఈ కార్యక్రమ విజయానికి నిదర్శనం. యువత ఉన్నత ఆశయాలకు భారత సైన్యం, స్వచ్ఛంద సంస్థల సమన్వయం గొప్ప భరోసాను కల్పిస్తాయని ఈ ఫలితాలు నిరూపిస్తున్నాయి.




# యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు?

న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపుల రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించాలన్న ప్రతిపాదన ప్రస్తుతం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. ఒకవేళ ఈ నిర్ణయం అమల్లోకి వస్తే, వ్యాపార నిర్వహణ వ్యయం పెరిగి, తద్వారా వినియోగదారుల కొనుగోలు శక్తిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే, యూపీఐ వ్యవస్థను దీర్ఘకాలికంగా ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం ప్రాథమికంగా పెద్ద వ్యాపార సంస్థలను లక్ష్యంగా చేసుకుని ఈ రుసుములను ప్రవేశపెట్టాలని భావిస్తోంది. ముఖ్యంగా ఏడాదికి రూ. 1 కోటి నుంచి రూ. 1.5 కోట్లు పైచిలుకు టర్నోవర్ ఉన్న వ్యాపారులపై 0.05 శాతం నుంచి 0.07 శాతం వరకు నామమాత్రపు ఎండీఆర్ విధించే అవకాశాలను పరిశీలిస్తోంది. కాగా, చిన్న వ్యాపారులు, కిరాణా దుకాణాలు మరియు వ్యక్తుల మధ్య జరిగే లావాదేవీలకు మాత్రం ప్రస్తుతమున్న మినహాయింపును కొనసాగించే అవకాశం ఉంది. 2020 జనవరి నుంచి యూపీఐ లావాదేవీలపై జీరో–ఎండీఆర్ విధానం కొనసాగుతోంది. దీనివల్ల డిజిటల్ లావాదేవీలు గణనీయంగా పెరిగినప్పటికీ, బ్యాంకులు మరియు పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లపై ఆర్థిక భారం అధికమైంది. ప్రభుత్వం ఏటా సుమారు రూ. 2,000 కోట్ల ప్రోత్సాహకాలను అందిస్తున్నప్పటికీ, ఇవి పరిశ్రమ మొత్తం నిర్వహణ ఖర్చులలో కేవలం 11 శాతాన్ని మాత్రమే భర్తీ చేస్తున్నాయని అంచనా. ఈ నేపథ్యంలో, యూపీఐ వ్యవస్థ మనుగడ సాగించాలంటే నామమాత్రపు రుసుము అనివార్యమని పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలు అభిప్రాయపడుతున్నాయి. ఒకవేళ కొత్తగా ఛార్జీలు విధిస్తే, వ్యాపారులు ఆ భారాన్ని వస్తువుల ధరలు పెంపు లేదా రాయితీల తగ్గింపు ద్వారా వినియోగదారులపైకి మళ్లించే ప్రమాదం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇది పరోక్షంగా వినియోగంపై ప్రభావం చూపవచ్చని వారు భావిస్తున్నారు. ఎండీఆర్ ప్రభావం పరోక్షంగా చిన్న వ్యాపారాలపై కూడా పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఏదేమైనా, డిజిటల్ చెల్లింపుల వృద్ధికి విఘాతం కలగకుండా, వ్యవస్థ స్థిరత్వాన్ని కాపాడేలా ప్రభుత్వం సమతుల్యమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## నీట్ లీక్‌తో ప్రమాదంలో విద్యార్థుల భవిష్యత్: మను భాకర్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న పరీక్ష పత్రాల లీకేజీల వ్యవహారంపై ఒలింపిక్ పతక విజేత, ప్రముఖ షూటర్ మను భాకర్ స్పందించింది. ఈ ఘటనల వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆమె ఆందోళన వ్యక్తం చేసింది. ఇది కేవలం రాజకీయాలకు సంబంధించిన అంశం మాత్రమే కాదని, దేశ భవిష్యత్తుతో ముడిపడి ఉన్న విషయమని ఆమె పేర్కొంది. శుక్రవారం సోషల్ మీడియా వేదికగా ఆమె ఒక పోస్ట్ చేస్తూ, “ప్రతి ఒక్కరూ విద్యార్థి దశను దాటి వచ్చినవారే. యువత కలలను, వారి ప్రతిభను కాపాడటం మనందరి బాధ్యత” అని పిలుపునిచ్చింది. విద్యార్థులందరికీ సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని ఆమె ఈ సందర్భంగా నొక్కి చెప్పింది. వ్యవస్థాగత లోపాల వల్ల విద్యార్థుల ఏళ్ల తరబడి కష్టం వృథా కావడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించడం ప్రాథమిక హక్కు అని, విద్యార్థుల కలలను, భవిష్యత్తును సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేసింది. మరోవైపు, ప్రముఖ బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌కు మద్దతు ప్రకటించాడు. విద్యార్థుల సమస్యలపై వాంగ్‌చుక్ వ్యక్తం చేస్తున్న ఆందోళనలతో తాను ఏకీభవిస్తున్నట్లు తెలిపాడు. కష్టపడి చదివే విద్యార్థులకు కచ్చితంగా న్యాయం జరగాలని, పరీక్షా విధానంపై ప్రజల్లో తిరిగి విశ్వాసం కలిగించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డాడు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్వహించిన పలు జాతీయ స్థాయి పరీక్షల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో విద్యార్థులు దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా మే 3న జరిగిన నీట్–యూజీ 2026 పరీక్ష పత్రం లీక్ కావడంతో, సుమారు 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఆ పరీక్షను రద్దు చేసింది. అనంతరం జూన్ 21న పకడ్బందీ భద్రత ఏర్పాట్ల మధ్య తిరిగి పరీక్షను నిర్వహించింది. ఈ పేపర్ లీకేజీ ఘటనపై ప్రస్తుతం సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. రాజస్థాన్, మహారాష్ట్ర, హర్యానా సహా పలు రాష్ట్రాల్లో నిందితులను ఇప్పటికే అరెస్టు చేశారు. లక్షలాది రూపాయలకు ప్రశ్నపత్రాలను విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. నీట్‌తో పాటు యూజీసీ–నెట్, మహారాష్ట్ర టెట్ వంటి పరీక్షల్లోనూ అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు విద్యార్థుల ఆగ్రహాన్ని మరింత పెంచాయి. ఈ క్రమంలో మను భాకర్ వంటి ప్రముఖులు విద్యార్థుల పక్షాన నిలవడం ఈ అంశం యొక్క ప్రాధాన్యతను చాటిచెబుతోంది.





## బాలుడిని లాక్కెళ్లి చంపేసిన మొసలి

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో విషాదం చోటుచేసుకుంది. నది ఒడ్డున చేతులు, ముఖం కడుక్కుంటున్న 12 ఏళ్ల బాలుడిపై ఓ భారీ మొసలి దాడి చేసి, నీటిలోకి లాక్కెళ్లి చంపేసింది. బహ్రైచ్ జిల్లాలో గురువారం సాయంత్రం ఈ హృదయ విదారక ఘటన జరిగింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలను సృష్టించింది. సునీల్ సింగ్ (12) అనే బాలుడు తన మామ విజయ్ రాజ్ సింగ్‌తో కలిసి వరి నాట్లు వేసేందుకు పొలానికి వెళ్లాడు. పని ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా, సమీపంలోని ఘాఘరా నది ఒడ్డుకు చేతులు, కాళ్లు శుభ్రం చేసుకోవడానికి వెళ్లాడు. ఆ సమయంలో నీటిలో నక్కి ఉన్న ఓ మొసలి అకస్మాత్తుగా సునీల్‌పై దాడి చేసి, నదిలోకి లాక్కెళ్లింది. కళ్లెదుటే మేనల్లుడిని మొసలి లాక్కెళ్లడం చూసిన విజయ్ రాజ్ సింగ్ వెంటనే నదిలోకి దూకి అతడిని కాపాడేందుకు ప్రయత్నించారు. అక్కడున్న గ్రామస్థులు కూడా సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. కానీ, ఆ మొసలి బలం ముందు వారి ప్రయత్నాలు విఫలమయ్యాయి. బాలుడిని అది నదిలో మరింత లోపలికి లాక్కెళ్లింది. ఈ ఘటన గురించి విజయ్ రాజ్ సింగ్ ఆవేదనతో మాట్లాడుతూ.. “నేను వెంటనే నదిలోకి దూకి వాడి చేతిని పట్టుకున్నాను. సుమారు ఏడు నిమిషాల పాటు వాడిని వెనక్కి లాగేందుకు ప్రయత్నించాను. కానీ, ఆ మొసలి చాలా బలంగా ఉంది. వాడిని లోతైన నీళ్లలోకి లాక్కెళ్లిపోయింది. నేను వాడిని కాపాడుకోలేకపోయాను” అని కన్నీటిపర్యంతమయ్యారు. గ్రామస్థులు చాలాసేపు గాలించిన తర్వాత రాత్రి 10 గంటల సమయంలో సునీల్ మృతదేహాన్ని నది నుంచి వెలికితీశారు. అయితే, అప్పటికే మొసలి బాలుడి శరీరాన్ని పాక్షికంగా తినేసిందని అటవీ శాఖ అధికారులు తెలిపారు. “మృతుడి నడుము కింది భాగాన్ని మొసలి తినేసింది” అని ఫారెస్ట్ రేంజర్ సాఖిబ్ అన్సారీ పేర్కొన్నారు. సునీల్ 6వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయిన అతను, తన మామతో కలిసి జీవిస్తున్నాడు. ఈ బాలుడి మరణంతో ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది.

## వాంగ్‌చుక్ ట్రీట్‌మెంట్ తీసుకోవడం లేదు: వైద్యులు

న్యూఢిల్లీ: సామాజిక ఉద్యమకారుడు, విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్ (59) చికిత్స తీసుకోవడానికి నిరాకరిస్తున్నారని వైద్యులు తెలిపారు. 20 రోజులుగా నిరాహార దీక్ష చేయడం వల్ల ఆయన చాలా బలహీనంగా తయారయ్యారని వెల్లడించారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ నిరాహార దీక్ష చేస్తున్న వాంగ్‌చుక్‌ను ఢిల్లీ పోలీసులు ఈరోజు ఉదయం సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించిన విషయం తెలిసిందే. ఆసుపత్రికి ఉదయం 7.40 గంటలకు వాంగ్‌చుక్‌ను తీసుకొచ్చారని బులెటిన్‌లో తెలిపింది. 20 రోజులుగా ఘనాహారం తీసుకోకపోవడం వల్ల ఆయన తీవ్ర నీరసంతో ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. ఆసుపత్రిలో చేర్చిన సమయంలో ఆయనకు స్పృహ ఉందని, పల్స్, రక్తపోటు, ఆక్సిజన్ స్థాయులు నిలకడగా ఉన్నాయని పేర్కొన్నారు. అయితే శరీరంలో నీటి శాతం తగ్గిన లక్షణాలు (డీహైడ్రేషన్) కనిపించాయని వెల్లడించారు. వైద్యులు ఇంట్రావీనస్ ఫ్లూయిడ్స్ (ఐవీ ద్రవాలు), ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్‌తో పాటు అవసరమైన మందులు తీసుకోవాలని సూచించారు. కానీ వాటన్నింటినీ వాంగ్‌చుక్ తిరస్కరించినట్టు ఆసుపత్రి తెలిపింది. ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ చికిత్స తీసుకోవాలని వైద్యులు కౌన్సెలింగ్ చేస్తున్నట్టు వెల్లడించింది. ఆసుపత్రిలో చేర్చిన కొద్దిసేపటికే వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జె ఆంగ్మో స్పందించారు. తన అనుమతి లేకుండా ఎలాంటి చికిత్స చేయొద్దని కోరారు. వైద్య చికిత్స విషయంలో పారదర్శకత లేదని ఆరోపిస్తూ ఆయనను డిశ్చార్జ్ చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రిలోనూ ఆయన దీక్ష కొనసాగిస్తున్నారని తెలిపారు.

## అభిషేక్ బెనర్జీ ఆఫీసు కూల్చివేత

కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) జాతీయ ప్రధాన కార్యదర్శి, డైమండ్ హార్బర్ ఎంపీ అభిషేక్ బెనర్జీకి చెందిన ఎంపీ కార్యాలయాన్ని అధికారులు శనివారం కూల్చివేయడంతో పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త వివాదం చెలరేగింది. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని అమ్‌తాలా–బరుయిపూర్ రోడ్డుపై ఉన్న ఈ కార్యాలయం అక్రమంగా నిర్మించారని ఆరోపిస్తూ అధికారులు బుల్డోజర్లతో కూల్చివేత చేపట్టారు. ఇప్పటికే అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టారని పేర్కొంటూ అధికారులు నోటీసులు జారీ చేశారు. శాంతిభద్రతల దృష్ట్యా భారీగా పోలీసులు, అధికారులు అక్కడ మోహరించారు. కూల్చివేత ప్రారంభమైన వెంటనే టీఎంసీ కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఈ పరిణామానికి ముందు అభిషేక్ బెనర్జీ, ఆయన కుటుంబ సభ్యులు, వారి సంస్థ ‘లీప్స్ అండ్ బౌండ్స్’ పేర్లపై నమోదైనట్లు పేర్కొన్న 17 ఆస్తులకు కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ (కేఎంసీ) కూల్చివేత నోటీసులు జారీ చేసింది. వాటిలో హరీశ్ ముఖర్జీ రోడ్డులోని అభిషేక్ నివాసం ‘శాంతినికేతన్’ కూడా ఉంది. ఇటీవల అభిషేక్ బెనర్జీకి సంబంధం ఉన్నాయని ఆరోపిస్తూ 43 ఆస్తుల జాబితాను బీజేపీ విడుదల చేసింది. అయితే ఆ ఆరోపణలను టీఎంసీ రాజ్యసభ సభ్యుడు సాకేత్ గోఖలే ఖండించారు. మున్సిపల్ రికార్డుల్లో ‘అభిషేక్ బెనర్జీ’ పేరుతో పలువురు ఉన్నారని, ఆ జాబితాలోని అన్ని ఆస్తులు టీఎంసీ నేతవేనని చెప్పలేమని స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఎంపీ కార్యాలయం కూల్చివేతపై అభిషేక్ బెనర్జీ గానీ, టీఎంసీ గానీ అధికారికంగా స్పందించలేదు.

## రాముడి విగ్రహం.. బంగ్లాలో హిందూ నేత అరెస్టు

ఢాకా: బంగ్లాదేశ్‌లో భారీ శ్రీరాముడి విగ్రహ నిర్మాణంతో సంబంధం ఉన్న ఒక హిందూ నేతను అరెస్టు చేయడం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఇది మతపరమైన కుట్రే అని ఆరోపిస్తూ హిందూ, బౌద్ధ, క్రైస్తవ మైనారిటీ సంఘాలు శనివారం ఢాకాలోని నేషనల్ ప్రెస్ క్లబ్ ఎదుట భారీ నిరసన చేపట్టాయి. ఆలయ నిర్మాణాన్ని అడ్డుకోవాలనే దురుద్దేశంతోనే ప్రభుత్వం తప్పుడు కేసు బనాయించిందని ఆ సంఘాలు ఆరోపించాయి. గైబంద జిల్లాలో 81 అడుగుల శ్రీరాముడి విగ్రహ నిర్మాణ పనులతో సంబంధం ఉన్న హరిదాస్ చంద్ర తరణి దాస్‌ను జూలై 12న క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ) అధికారులు అరెస్టు చేశారు. సుమారు 9.35 కోట్ల టాకాల మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారనే ఆరోపణలపై ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం న్యాయస్థానం ఆయనకు నాలుగు రోజుల రిమాండ్ విధించింది. కాగా, ఈ అరెస్టు వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని బంగ్లాదేశ్ హిందూ–బౌద్ధ–క్రైస్తవ ఐక్య వేదిక (యూనిటీ కౌన్సిల్) ఆరోపించింది. “మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి అక్రమ అరెస్టులు చేయడాన్ని మేము అంగీకరించబోము” అని కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి మణీంద్ర కుమార్ నాథ్ స్పష్టం చేశారు. గత ఏడాది కాలంలో మైనారిటీలపై 3,000 దాడులు జరిగాయని, ఈ ఘటనల్లో 66 మంది ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గైబంద జిల్లాలోని పలాశ్‌బరిలో శ్రీరాముడి ఆలయ నిర్మాణ పనులు ఇప్పటికే 80 శాతం పూర్తయ్యాయి. అయితే, కొన్ని ఇస్లామిక్ గ్రూపుల నుంచి బెదిరింపులు రావడంతో జూన్ నెలలో నిర్మాణ పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. తాజాగా, ఈ నిర్మాణంతో సంబంధం ఉన్న వ్యక్తిని అరెస్టు చేయడంతో ఈ వివాదం మరోసారి రాజుకుంది. హరిదాస్‌ను వెంటనే విడుదల చేయని పక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని మైనారిటీ నాయకులు హెచ్చరించారు.

## నార్వార్ కోటలో 3 వేల కిలోల ఫిరంగి చోరీ

శివ్‌పురి: మధ్యప్రదేశ్‌లోని శివ్‌పురి జిల్లాలో అత్యంత సాహసోపేతమైన రీతిలో భారీ చోరీ చోటుచేసుకుంది. సింధియా రాజవంశం కాలం నాటి చారిత్రక నార్వార్ కోట నుంచి సుమారు 3,000 కిలోల బరువున్న భారీ ఫిరంగిని దుండగులు అపహరించారు. ఈ భారీ దోపిడీ కోసం నిందితులు క్రేన్, ట్రక్కును ఉపయోగించడం స్థానికంగా కలకలం రేపుతోంది. క్రేన్ సహాయంతో ఫిరంగిని ట్రక్కులోకి ఎక్కించి వారు అక్కడి నుంచి పరారయ్యారు. జూలై 15 అర్ధరాత్రి ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. సుమారు 25 నుంచి 30 మంది సాయుధులు కోట వెనుక మార్గం ద్వారా లోపలికి ప్రవేశించారు. విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డు బాల్‌కిషన్‌ను తుపాకీతో బెదిరించి, ప్రతిఘటించవద్దని హెచ్చరించారు. తన వద్ద కేవలం కర్ర మాత్రమే ఉందని, దుండగులు అత్యాధునిక ఆయుధాలతో వచ్చారని, కనీసం టార్చ్‌లైట్ వంటి ప్రాథమిక సౌకర్యాలు కూడా అక్కడ లేవని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. కోటలోని కచేరి ప్రాంగణంలో మొత్తం 14 ఫిరంగులు ఉండగా, వాటిలో అత్యంత విలువైన ఒక ఫిరంగిని దుండగులు ఎత్తుకెళ్లారు. 16వ శతాబ్దానికి చెందిన ఈ ఫిరంగికి సింధియా కాలంలో సైనికపరంగా విశేష ప్రాముఖ్యత ఉండేది. దీనిపై ఉన్న అద్భుతమైన కళాకృతులు, గుర్తులు ఆ ఫిరంగికి ఉన్న చారిత్రక విలువను చాటిచెబుతాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కరేరా ఎస్‌డీపీఓ ప్రశాంత్ శర్మ నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు నిందితుల కోసం గాలిస్తున్నాయి. పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ తరుణ్ కుమార్ మహోబియా ఈ చోరీని తీవ్రంగా పరిగణించి, భద్రతా ఏర్పాట్లను సమీక్షించేందుకు కోటను సందర్శించనున్నట్లు వెల్లడించారు. సమీపంలోని సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ దోపిడీ వెనుక అంతర్జాతీయ పురావస్తు స్మగ్లింగ్ ముఠాల హస్తం ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదు.



## వినాయక మండపం ఏర్పాటుపై వివాదం

కరీంనగర్, జూలై 19 (ఈవార్తలు): కరీంనగర్ నగరంలోని రాంనగర్‌లో గణేష్ మండపం ఏర్పాటు విషయంలో తలెత్తిన వివాదం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. గణేష్ నవరాత్రి ఉత్సవాల కోసం మండపం ఏర్పాటు చేసే అంశంపై రెండు వర్గాల మధ్య విభేదాలు తలెత్తడంతో ఘర్షణ చోటుచేసుకుంది. ఘటన అనంతరం ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి ఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తూ దర్యాప్తు చేపట్టారు. ఘర్షణ నేపథ్యంలో రాంనగర్ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అదనపు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సమాచారం. స్థానికంగా ప్రారంభమైన ఈ వివాదం ప్రస్తుతం రాజకీయ చర్చకు కూడా దారితీసింది. అయితే, ఘర్షణకు గల పూర్తి కారణాలు, బాధ్యులపై చర్యల విషయంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## చాయ్ అంటే.. గాలి శీను టీ స్టాల్‌కు పోవాలె!

**అద్భుతమైన చాయ్.. 35 ఏళ్లుగా ఒకే వృత్తి**



మల్యాల, జూలై 19 (ఈవార్తలు): ఒక కప్పు చాయ్‌తో అనుబంధాలను పెంచుకుంటూ, గత 35 ఏళ్లుగా మల్యాల ప్రజలకు తన ప్రత్యేక రుచిని పరిచయం చేస్తున్న వ్యక్తి గాలి శీను. చిన్న టీ హోటల్‌తో జీవనం ప్రారంభించిన ఆయన, నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రతిరోజూ వందలాది మందికి వేడి వేడి చాయ్ అందిస్తూ స్థానికుల అభిమానాన్ని సంపాదించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు తన హోటల్‌కు వచ్చే ప్రతి కస్టమర్‌ను ఆప్యాయంగా పలకరిస్తూ, రుచికరమైన చాయ్‌ను అందించడం గాలి శీను ప్రత్యేకతగా నిలిచింది. మూడు దశాబ్దాలకుపైగా ఒకే వృత్తిని నమ్ముకుని నిజాయితీగా సేవలందిస్తున్న ఆయనకు మల్యాల ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు ఏర్పడింది. 'ఒక్కసారి తాగితే మళ్లీ మళ్లీ తాగాలనిపించే చాయ్' అనే పేరును సంపాదించుకున్న గాలి శీను, తన కష్టపడి పనిచేసే తత్వంతో యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. వ్యాపారంలో నాణ్యత, వినయం, కస్టమర్లతో ఆప్యాయత ఉంటేనే విజయం సాధించవచ్చని ఆయన నిరూపిస్తున్నారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మల్యాల చాయ్ సంస్కృతిలో గాలి శీను పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని ప్రశంసిస్తున్నారు.




## ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ

**ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి**

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు**

జగిత్యాల, జూలై 18 (ఈవార్తలు): సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జగిత్యాల కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని సంజయ్ జాజు సూచించారు. రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించి పంటల మార్పిడి, తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. అవసరమైన విత్తనాలు, సాంకేతిక సూచనలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.జిల్లాల వారీగా వర్షపాతం, వ్యవసాయం, తాగునీరు, శాఖల కార్యాచరణ ప్రణాళికలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగే సమీక్షకు అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి. రాజగౌడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్, డీఎంహెచ్‌వో సుజాత, సీపీఓ సత్యం, డీపీఓ మదన్‌మోహన్, డిప్యూటీ సీఈవో నరేష్, ఉద్యానవన శాఖ అధికారి లత తదితరులు పాల్గొన్నారు.

## కూలిన ప్రహరీతో విద్యార్థులకు ముప్పు

**వీక్లీ బజార్ పాఠశాలకు రక్షణ గోడ నిర్మించాలి**

**జగిత్యాల కౌన్సిలర్ వేములు శ్రీనివాస్ డిమాండ్**



జగిత్యాల టౌన్, జూలై 18 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని 5వ వార్డు వీక్లీ బజార్ పాఠశాలలో కూలిపోయిన ప్రహరీ గోడను వెంటనే నిర్మించి విద్యార్థులకు రక్షణ కల్పించాలని 5వ వార్డు కౌన్సిలర్ వేముల శ్రీనివాస్ కోరారు. పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు సుమారు 200 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. గత ఏడాది కూలిపోయిన ప్రహరీ గోడను ఇప్పటివరకు పునర్నిర్మించకపోవడంతో పాఠశాల ఆవరణలోకి పాములు వస్తున్నాయని, విద్యార్థుల భద్రతకు ముప్పు పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పాఠశాల ఉపాధ్యాయులు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పాములు పాఠశాల ఆవరణలోకి వచ్చే అవకాశం ఉందని, ఏదైనా ప్రమాదం జరిగితే విద్యార్థుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని కౌన్సిలర్ పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కూలిపోయిన ప్రహరీ గోడను నిర్మించి విద్యార్థులకు రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

# గోవిందా.. నీకు దిక్కెవరు?

**శిథిలావస్థలో400 ఏళ్ల వేంకటేశ్వరస్వామి ఆలయం .. పునరుద్ధరణకు భక్తుల విజ్ఞప్తి**



మల్యాల, జూలై 19 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం తక్కళ్లపల్లి శివారులో ఉన్న సుమారు 400 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం తీవ్ర నిర్లక్ష్యానికి గురై శిథిలావస్థకు చేరుకుంది. కాకతీయుల కాలంలో నిర్మించబడినట్లు భావిస్తున్న ఈ చారిత్రక రాతి ఆలయం కాలగర్భంలో కలిసిపోయే పరిస్థితి నెలకొనడంతో భక్తులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ గర్భగుడి వెనుక భాగం పూర్తిగా కూలిపోగా, శతాబ్దాల చరిత్రను చాటే రాతి నిర్మాణాలు శిథిలాల కుప్పగా మారాయి. ఆలయ ప్రాంగణంలో ఉన్న శివలింగం, నందీశ్వరుడి విగ్రహాలు కూడా సరైన సంరక్షణ లేక నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఆలయం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి, శిథిలాలు పేరుకుపోవడంతో ఈ చారిత్రక కట్టడం తన పూర్వ వైభవాన్ని కోల్పోతోంది. తెలంగాణ చారిత్రక, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన ఈ ఆలయాన్ని పురావస్తు శాఖ, దేవాదాయ శాఖ అధికారులు వెంటనే గుర్తించి పరిరక్షణ చర్యలు చేపట్టాలని భక్తులు, గ్రామస్తులు కోరుతున్నారు. ఆలయాన్ని పునరుద్ధరిస్తే ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక పర్యాటకానికి ఊతమివ్వడంతో పాటు, విలువైన చారిత్రక వారసత్వాన్ని భావితరాలకు అందించే అవకాశం ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ 400 ఏళ్ల ప్రాచీన ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని, శిథిలావస్థకు చేరుకున్న ఈ ఆధ్యాత్మిక క్షేత్రాన్ని రక్షించాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# తెలంగాణకు అసలైన సంక్షోభం రేవంతే

**జగిత్యాల తొలి జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత**



సారంగాపూర్, జూలై 18 (ఈవార్తలు): రాష్ట్రంలో విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ ఆరోపించారు. సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రేచపల్లి రైతు ఆధారిత గ్రామమని, ప్రస్తుతం రైతులు పంటలకు నీరు పెట్టేందుకు కరెంటు కోసం రాత్రింబవళ్లు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నాట్ల సమయంలో విద్యుత్ కోతలు విధించడం సరికాదని పేర్కొన్నారు. రైతును రాజును చేస్తానన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలు నీటి మూటలయ్యాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు నీళ్లు, కరెంటు, ఎరువులు, విత్తనాల కొరతతో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. గతంలో కేసీఆర్ పాలనలో 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించామని, ప్రస్తుతం అదే విధంగా విద్యుత్ ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ హయాంలో రైతులు సమృద్ధిగా పంటలు పండించారని అన్నారు. కాళేశ్వరం వంటి ప్రాజెక్టులను వినియోగించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. నీళ్లు అందించలేని పరిస్థితిలో ఉన్నా కనీసం నిరంతర విద్యుత్ సరఫరా చేస్తే ఉన్న నీటితో పంటలు పండించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. కరెంటు కోతలపై రైతులతో కలిసి పోరాటం చేస్తామని ప్రకటించారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని, అభివృద్ధి పేరుతో పార్టీ మారడం కాదు.. ప్రజల సమస్యలను పరిష్కరించడమే నిజమైన అభివృద్ధి అని అన్నారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం, అధికారులు రైతుల కష్టాలను అర్థం చేసుకుని నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తేలు రాజు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సాగి సత్యంరావు, మ్యాదారం తండా సర్పంచ్ చిరంజీవి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రామ్‌చందర్‌రెడ్డి, జగన్, మధర్‌ప్రసాద్, రమేష్, రాజా, మల్లు, శేఖర్, రాజు, గంగన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ నినోపై రైతులకు అవగాహన



వేములవాడ అర్బన్, జూలై 18 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం చంద్రగిరి గ్రామంలో వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ నిపుణులు, మండల వ్యవసాయ అధికారులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, పంటల ఎంపిక, సాగు విధానాలపై రైతులకు పలు సూచనలు చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ మాట్లాడుతూ.. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం అనిశ్చితంగా ఉండే అవకాశం ఉన్నందున అధిక నీటి అవసరమయ్యే వరి సాగును సాధ్యమైనంత వరకు తగ్గించాలని రైతులకు సూచించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల మెట్ట పంటలను సాగు చేయడం ఉత్తమమని అన్నారు. పెసలు, మినుములు, కందులు వంటి పప్పుధాన్యాల సాగు రైతులకు ఆర్థికంగా లాభదాయకంగా ఉండటమే కాకుండా భూమి సారాన్ని కూడా పెంచుతుందని తెలిపారు. వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకుంటే నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. మండల వ్యవసాయ కార్యాలయంలో కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, సాగు చేయాలనుకునే రైతులు ఆలస్యం చేయకుండా వెంటనే విత్తనాలు పొందాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విత్తనాలు, సాంకేతిక సలహాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రైతులు ఎల్‌నినో ప్రభావం, పంటల మార్పు, విత్తనాల ఎంపిక, ఎరువుల వినియోగం తదితర అంశాలపై అధికారులను ప్రశ్నించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకుని సాగు చేపడతామని రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్, చంద్రగిరి గ్రామ సర్పంచ్ సంజన, వ్యవసాయ సంఘం ప్రతినిధులు, గ్రామ రైతులు పాల్గొన్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ రైతుల ఆదాయాన్ని కాపాడటమే ఈ అవగాహన సమావేశం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.



## గోదావరి పుష్కరాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**భక్తులకు అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళిక**

**లా అండ్ ఆర్డర్ డీజీపీ మహేష్ భగవత్ ఆదేశాలు**

జగిత్యాల, జూలై 18 (ఈవార్తలు): రానున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శాంతిభద్రతలు, ట్రాఫిక్ నిర్వహణ, అత్యవసర సేవలపై ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని లా అండ్ ఆర్డర్ డీజీపీ మహేష్ భగవత్ జిల్లా ఎస్పీలను ఆదేశించారు. ఈ మేరకు గోదావరి పుష్కరాలు జరిగే జిల్లాల ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. పుష్కర ఘాట్ల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తగిన సంఖ్యలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని డీజీపీ సూచించారు. ట్రాఫిక్ రద్దీ నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రజలకు ముందుగానే అవగాహన కల్పించాలని తెలిపారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, తప్పిపోయిన వారిని గుర్తించేందుకు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. నదిలో స్నానాలు చేసే ప్రాంతాల్లో ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈతగాళ్లు, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక, వైద్య శాఖలతో సమన్వయం పెంచి అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేలా సిద్ధంగా ఉండాలని సూచించారు. పుష్కర ఘాట్లు, ప్రధాన కూడళ్లు, పార్కింగ్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో నిరంతర నిఘా కొనసాగించాలని, అవసరమైన చోట డ్రోన్ నిఘా వినియోగించాలని తెలిపారు. పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా భక్తులకు ఎప్పటికప్పుడు సూచనలు అందించాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుని భక్తులకు సురక్షితమైన, ప్రశాంతమైన వాతావరణంలో గోదావరి పుష్కరాలు నిర్వహించేందుకు పోలీసు అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు ఆరిఫ్ అలీఖాన్, రామ్ నరసింహారెడ్డి, సురేష్‌బాబు, ఎస్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## మహిళను కాపాడిన పోలీసులకు ఎస్పీ అభినందనలు



జగిత్యాల/గొల్లపల్లి, జూలై 18 (ఈవార్తలు): విధి నిర్వహణలో అప్రమత్తత, వేగవంతమైన స్పందనతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడబోయిన ఓ మహిళ ప్రాణాలను కాపాడిన గొల్లపల్లి పోలీస్‌స్టేషన్ బ్లూకోల్ట్స్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. హెడ్ కానిస్టేబుల్ ఆనంద్, కానిస్టేబుల్ రవిని ప్రశంసించారు. శుక్రవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో భర్తతో కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురైన శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన ఓ మహిళ ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఆమె గ్రామ శివారులోని కాలువ వైపు వెళుతుండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే డయల్--100కు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే బ్లూకోల్ట్స్ సిబ్బంది ఆనంద్, రవి సంఘటనా స్థలానికి చేరుకుని మహిళతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, కౌన్సెలింగ్ నిర్వహించి సురక్షితంగా వారితో పంపించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో సమయస్ఫూర్తి, మానవత్వంతో స్పందించడం ప్రతి పోలీసు బాధ్యత అన్నారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది వేగంగా స్పందించి ఒక విలువైన ప్రాణాన్ని కాపాడడం అభినందనీయమని కొనియాడారు. ఆత్మహత్య ఏ సమస్యకూ శాశ్వత పరిష్కారం కాదని, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోవద్దని ప్రజలకు సూచించారు.

## మహమ్మద్ ఫరూక్ అలీకి గౌరవ డాక్టరేట్



జగిత్యాల టౌన్, జూలై 18 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని ఖాజీపురాకు చెందిన సామాజిక కార్యకర్త మొహమ్మద్ ఫరూక్ అలీకి గౌరవ డాక్టరేట్ లభించింది. గత కొన్నేళ్లుగా ఆయన చేస్తున్న సామాజిక సేవలను గుర్తించిన సహారా చారిటబుల్ ట్రస్టు ఈ గౌరవాన్ని ప్రకటించింది. ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో మొహమ్మద్ ఫరూక్ అలీకి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు నాయకులు, సామాజిక కార్యకర్తలు, ఈగల్ టీం సభ్యులు ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## సెకండ్‌హ్యాండ్ మొబైల్ కొంటే జాగ్రత్త

**ఆధార్‌తో పాటు పూర్తి వివరాలు నమోదు చేయాలి**

**రాజన్న సిరిసిల్ల ఎస్పీ మహేష్ బీ గితే**

సిరిసిల్ల/వేములవాడ టౌన్, జూలై 18 (ఈవార్తలు): సెకండ్‌హ్యాండ్ మొబైల్ ఫోన్ల కొనుగోలు, ఎక్స్ఛేంజ్ సమయంలో విక్రయించే వ్యక్తి ఆధార్ కార్డు సహా పూర్తి వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మొబైల్ షాపుల యజమానులకు సూచించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పరిధిలోని మొబైల్ విక్రయ, రిపేర్ షాపుల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో దొంగిలించబడిన లేదా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను విక్రయించేందుకు లేదా ఎక్స్ఛేంజ్ చేసేందుకు కొందరు ప్రయత్నించే అవకాశం ఉన్నందున వ్యాపారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఫోన్ విక్రయించేందుకు వచ్చే ప్రతి వ్యక్తి ఆధార్ కార్డు, చిరునామా, ఫోన్ నంబర్ వంటి పూర్తి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా, దొంగిలించిన మొబైల్ ఫోన్‌ను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు అనుమానం వచ్చినా వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. మొబైల్ ఫోన్ దొంగలను పట్టించడంలో లేదా వారి ఆచూకీ అందించడంలో సహకరించే మొబైల్ షాపుల యజమానులకు జిల్లా పోలీసుల తరఫున ప్రశంసాపత్రాలు అందజేస్తామని వెల్లడించారు. సెకండ్‌హ్యాండ్ మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసే వినియోగదారులు కూడా సంబంధిత షాపు నుంచి తప్పనిసరిగా బిల్లు లేదా రసీదు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. తక్కువ ధరకు లభిస్తుందనే ఆశతో దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను కొనుగోలు చేస్తే చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. దొంగిలించబడిన మొబైల్ అని తెలిసి కూడా కొనుగోలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్లను విక్రయించాలనుకునే వారు సంబంధిత కంపెనీల అధికారిక స్టోర్లలో ఎక్స్ఛేంజ్ చేయడం లేదా చట్టబద్ధమైన విక్రయ కేంద్రాల ద్వారా మాత్రమే విక్రయించాలని, తెలియని వ్యక్తులకు లేదా అనధికారికంగా కొనుగోలు చేసే షాపులకు విక్రయించవద్దని సూచించారు. అందరి సహకారంతోనే మొబైల్ ఫోన్ల రికవరీలో దక్షిణ భారతదేశంలో మొదటి స్థానం, రాష్ట్రంలో వరుసగా మూడో ఏడాది మొదటి స్థానాన్ని జిల్లా సాధించిందని ఎస్పీ తెలిపారు. ప్రజల సహకారంతోనే నేరాలను మరింత సమర్థంగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఐటీ కోర్ ఎస్ఐ కిరణ్ కుమార్, కానిస్టేబుల్ రాజా తిరుమలేష్‌తో పాటు జిల్లాలోని పలువురు మొబైల్ షాపుల యజమానులు పాల్గొన్నారు.



## జగన్నాథుని కృపతో వర్షాలు కురవాలి

**ఎల్‌నినో ప్రభావం త్వరగా తొలగిపోవాలి**

**ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్**

జగిత్యాల, జూలై 18 (ఈవార్తలు): జగన్నాథ స్వామివారి కృపతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఆకాంక్షించారు. ఎల్‌నినో ప్రభావం త్వరగా తొలగిపోయి ప్రజలకు, రైతులకు అనుకూల వాతావరణం ఏర్పడాలని కోరుకున్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలోని పార్కు సమీపంలో నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథ స్వామివారిని దర్శించుకుని ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థించారు. కార్యక్రమంలో నాయకులు సమిండ్ల శ్రీనివాస్, శివ కేసరి బాబు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## లవ్లీ చిత్రం



అనన్య పాండే



## 'ది ఒడిస్సీ' ఎంతొచ్చాయ్?

హాలీవుడ్ ప్రఖ్యాత దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తీసిన సినిమా 'ది ఒడిస్సీ' ఎట్టకేలకు థియేటర్లలోకి వచ్చింది. అయితే విడుదలకు ముందు కొంత నెగిటివిటీ వినిపించింది గానీ రిలీజైన తర్వాత అంతటా పాజిటివ్ టాక్ తప్పితే మరొకటి వినిపించడం లేదు. మరి ఇంతలా సౌండ్ చేస్తున్న ఈ చిత్రానికి తొలిరోజు కలెక్షన్స్ ఎంతొచ్చాయ్? మొదటిరోజు మన దగ్గర ఎన్ని కోట్లు వచ్చాయ్? మ్యాట్ డామన్, ఆన్ హాత్వే, టామ్ హోలండ్, రాబర్ట్ పాటిన్సన్, జెండాయా ప్రధాన పాత్రల్లో కనిపించిన 'ది ఒడిస్సీ' సినిమాని మూడువేళ్ల ఏళ్ల క్రితం హోమర్ అనే రచయిత రాసిన ఒడిస్సీ నవల ఆధారంగా తీశారు. రూ.2200 కోట్ల బడ్జెట్‌తో నిర్మించారు. విడుదల కావడానికి ముందే ప్రపంచవ్యాప్తంగా భారీ హైప్ సొంతం చేసుకున్న ఈ చిత్రానికి తొలిరోజు అదే స్థాయిలో వసూళ్లు వచ్చాయి. ఓవరాల్‌గా 50 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.418 కోట్లు) వచ్చాయి. ఇందులో మన దేశం నుంచి రూ.17 కోట్ల మేర నెట్ వసూళ్లు సాధించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం టాక్ పాజిటివ్ రావడం, దగ్గరలో మరో సినిమా లేదు కాబట్టి వసూళ్ల పరంగా బాక్సాఫీస్ దగ్గర 'ది ఒడిస్సీ' సినిమా సరికొత్త రికార్డులు సృష్టించే అవకాశమైతే ఉంది. తెలుగు, హిందీ లాంటి ప్రాంతీయ భాషల్లోనూ రిలీజ్ చేయడం ఈ మూవీకి ప్లస్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. 'ది ఒడిస్సీ' విషయానికొస్తే.. ఒడిసియస్(మ్యాట్ డామన్) ట్రోజన్ యుద్ధంలో పదేళ్ల పాటు పోరాడి గెలుస్తాడు. త్వరగా భార్య పెనలోపి(ఆన్ హాత్వే), కొడుకు టెలీమాకస్(టామ్ హాలెండ్) దగ్గరకు వెళ్లిపోవాలనుకుంటాడు. ఈ క్రమంలోనే తన సైనికులతో కలిసి పడవ ప్రయాణం చేస్తాడు. అయితే దారిలో అనుకోని సంఘటనలు ఎదురవుతాయి. దీంతో పదేళ్ల పాటు ఎక్కడెక్కడో తిరిగి రాజ్యానికి చేరుకుంటాడు.



## వారణాసిలో ప్రియాంక లుక్

గ్లోబల్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా పుట్టినరోజు సందర్భంగా వారణాసి చిత్రం నుండి ఆమెకు స్పెషల్ విషెస్ చెబుతూ రెండు పోస్టర్లను రిలీజ్ చేశారు రాజమౌళి. అయితే ఈ రెండు పోస్టర్లు చూసిన తర్వాత ఆడియన్స్ లో సరికొత్త అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అసలు విషయంలోకి వెళ్తే.. ప్రియాంక చోప్రా ఈ సినిమాలో మందాకిని అనే ఒక పవర్ఫుల్ యాక్షన్ పాత్రలో నటిస్తున్నట్లు ఆమె పోస్టర్ ను రిలీజ్ చేసి, ఆమె పాత్ర పై అంచనాలు పెంచిన విషయం తెలిసిందే. ఇక నేడు ఆమె పుట్టిన రోజు కావడంతో రాజమౌళి ఈ సినిమాలోని ఆమె పాత్రకు సంబంధించి 2 ఫోటోలను రిలీజ్ చేస్తూ.. ఈ విధంగా కొటేషన్ పంచుకున్నారు." ఆమె నవ్వినప్పుడు సౌందర్యం.. నవ్వనప్పుడు అగ్ని కణికం.. వారణాసిలో మందాకిని పాత్రలో ప్రియాంక చోప్రా" అంటూ ఆమె జాలీగా ఉన్న ఒక ఫోటోని మరొకవైపు కోపంతో భయంకరంగా చూస్తున్న మరొక ఫోటోని షేర్ చేశాడు రాజమౌళి. రాజమౌళి షేర్ చేసిన ఈ రెండు ఫోటోలను బట్టి చూస్తే ఇందులో ప్రియాంక చోప్రా ద్విపాత్రాభినయం పోషిస్తోందా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరికొంతమంది ప్రియాంక చోప్రా ఇందులో కవల పిల్లలుగా రెండు పాత్రలు పోషించబోతున్నారని కామెంట్లు చేస్తుంటే.. ఇంకొంతమంది ఒకటి విలన్ గా మరొకటి హీరోయిన్గా నటిస్తోంది కాబోలు అంటూ ఇలా ఎవరికి వారు తమ అభిప్రాయాలను వ్యక్తపరుస్తున్నారు. ఇప్పటికే మహేష్ బాబు రుద్రుడిగా, శ్రీరాముడిగా కనిపిస్తారంటూ వార్తలు రాగా.. ఇప్పుడు ఈ ఫోటోలను చూసిన నెటిజన్స్ రాజమౌళి ఏదో ప్లాన్ చేస్తున్నాడు.. ఇందులో ప్రియాంక కూడా ద్విపాత్రాభినయం చేస్తోంది కాబోలు అందుకే ఇలా హింట్ ఇచ్చాడు అంటూ కామెంట్లు చేస్తున్నారు.



## సెల్ఫ్ రెస్పెక్ట్ ముఖ్యం


సమీరా రెడ్డి తన తొలి చిత్రం 'మైనే దిల్ తుజ్కో దియా' రోజులను గుర్తు చేసుకుంటూ.. తన సహజ రూపాన్ని మార్చడానికి ఇండస్ట్రీ ఎంత ఒత్తిడి తెచ్చిందో ఆవేదన వ్యక్తం చేశారు. మేకప్ ద్వారా ఆమె రంగును రెండు మూడు షేడ్స్ తెల్లగా మార్చేవారట. అంతేకాదు, తోటి హీరోల కంటే తాను పొడవుగా కనిపిస్తానేమో అని భయంతో నడుస్తున్నప్పుడు వంగి నడిచేదాన్ని అని ఆమె చెప్పారు. ఇక హీరో ఆధిపత్యం కోసం ఒక నటి తన సహజత్వాన్ని ఎంతగా చంపుకోవాల్సి వస్తుందో ఈ విషయాలు నిరూపిస్తున్నాయి. తన సహజ రూపం ఇండస్ట్రీకి సరిపోదనే అభద్రతాభావంతో సమీరా రెడ్డి ఏళ్ల తరబడి ప్యాడెడ్ బ్రాలు, బమ్ ప్యాడ్స్, రంగురంగుల కాంటాక్ట్ లెన్స్‌లు వాడాల్సి వచ్చింది.



## లెనిన్ విజయగర్వంలో ఉన్నా

టాలీవుడ్ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ అక్కినేని అఖిల్ జీవితంలోకి ఆమె -లేడీ లక్-లా అడుగుపెట్టారు. అఖిల్, జైనబ్ రావూజీల వివాహం తర్వాత అఖిల్ కెరీర్ సరికొత్త మలుపు తిరిగిందనడానికి ఈ విజయం నిదర్శనం. తాజాగా అఖిల్ నటించిన -లెనిన్- చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడంతో అక్కినేని కుటుంబంతో పాటు అభిమానుల్లోనూ పండగ వాతావరణం నెలకొంది. ఈ సినిమా సాధించిన ఘనవిజయాన్ని అఖిల్ భార్య జైనబ్ రావూజీ ఎంతో ఉత్సాహంగా, సంతోషంగా ఎంజాయ్ చేస్తున్నారు. రీసెంట్‌గా జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో జైనబ్ సందడి చేస్తూ.. --అయ్యగారు నంబర్ వన్-- అంటూ ఎంతో ఉత్సాహంగా కనిపించడం అక్కినేని అభిమానులను ఎంతగానో ఖుషీ చేసింది. సినిమా ఘనవిజయం సాధించిన ఆనందాన్ని జైనబ్ సోషల్ మీడియా వేదికగా మరోసారి షేర్ చేసుకున్నారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేస్తూ..--లెనిన్ చిత్రాన్ని ఇంత పెద్ద బ్లాక్‌బస్టర్ చేసినందుకు మీ అందరికీ ధన్యవాదాలు. అఖిల్‌పై మీరంతా చూపిస్తున్న ప్రేమాభిమానాలకు నేను నిజంగా కృతజ్ఞతురాలిని... చాలా సంతోషంగా ఉంది-- అంటూ భావోద్వేగంగా రాసుకొచ్చారు.

## జాన్వీ ప్లాన్ అదుర్స్



ఇటీవల విడుదలైన పెద్ది చిత్రం వివాదాలతో వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. సినిమాలో జాన్వీ కపూర్ పాత్రను చిత్రీకరించిన తీరుపై.. ముఖ్యంగా కెమెరా యాంగిల్స్ , కొన్ని సన్నివేశాల విషయంలో జాన్వీ కపూర్ తీవ్ర విమర్శలను ఎదుర్కోవాల్సి వచ్చింది. చిత్రంలో అచ్చియమ్మ పాత్రను కేవలం గ్లామర్ కోసమే వాడుకున్నారనే ఆరోపణలు రావడంతో? చిత్రబృందం దిద్దుబాటు చర్యలకు దిగాల్సి వచ్చింది. ఈ ప్రతికూల వాతావరణం నుండి బయటపడిన జాన్వీ కెరీర్‌లో తాజాగా కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. -పగ్లైట్- వంటి విమర్శకుల ప్రశంసలు పొందిన చిత్రానికి దర్శకత్వం వహించిన ఉమేష్ బిస్త్‌తో జాన్వీ కపూర్ చేతులు కలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం స్క్రిప్ట్ దశలో ఉంది. ఇంకా టైటిల్ నిర్ణయించలేదు.

## సెట్స్‌లో రూల్స్ ఒకేలా ఉండవు

తిలోత్తమ షోమ్

పరిశ్రమలో షూటింగ్ వేళల గురించి జరుగుతోన్న చర్చలు ఓ కొత్త మలుపు తీసుకుంటున్నాయి. సాధారణంగా అసిస్టెంట్ డైరెక్టర్లు, టెక్నీషియన్లు గంటల తరబడి పనిచేస్తుంటారు. అయితే నటి తిలోత్తమ షోమ్ తాజాగా చేసిన వ్యాఖ్యలు పరిశ్రమలో అసమానతలను బయట పెడుతున్నాయి. ఎనిమిది గంటల పని షిఫ్ట్ గురించి జరుగుతున్న చర్చల నేపథ్యంలో సీనియర్ నటీనటులు పని చేసే వేళల గురించి చేసిన విశ్లేషణ చర్చనీయాంశంగా మారింది. తిలోత్తమ షోమ్ అభిప్రాయం ప్రకారం.. పరిశ్రమలో పని వేళల విషయంలో ఓ వింతైన వైఖరి కనిపిస్తోంది. చాలా మంది సీనియర్ కళాకారులు రోజుకు ఎనిమిది గంటల కంటే తక్కువ సమయమే పని చేస్తున్నారని, కానీ ఆ విషయంపై ఎవరూ బహిరంగంగా మాట్లాడరని పేర్కొన్నారు.





# ఆటను ఆస్వాదిస్తే ఒత్తిడి మాయం

## ఫుట్‌బాల్ మాంత్రికుడు లియోనెల్ మెస్సీ

ప్రపంచ క్రీడారంగంలోని ఇద్దరు అగ్రశ్రేణి దిగ్గజాలు ఒకే వేదికపై కలిస్తే ఎలా ఉంటుంది? ఒకరినొకరు గౌరవించుకుంటూ, తమ అనుభవాలను పంచుకుంటే అభిమానులకు పండగే. అలాంటి అరుదైన ఘట్టానికి న్యూయార్క్‌లోని మాన్‌హాటన్‌లో జరిగిన 'ఫ్యానాటిక్స్ ఫెస్ట్' వేదికైంది. టెన్నిస్ గ్రేట్ నొవాక్ జొకోవిచ్, ఫుట్‌బాల్ మాంత్రికుడు లియోనెల్ మెస్సీ మధ్య ఒత్తిడిని జయించడంపై జరిగిన సంభాషణ ఇప్పుడు క్రీడా ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది. రేపు స్పెయిన్‌తో జరగను న్న ఫిఫా ప్రపంచకప్ ఫైనల్‌కు ముందు ఈ ఘటన చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో టెన్నిస్ చరిత్రలోనే అత్యధిక గ్రాండ్‌స్లామ్‌లు గెలిచిన జొకోవిచ్, అర్జెంటీనా కెప్టెన్ మెస్సీని ఉద్దేశించి ఒక సూటి ప్రశ్న సంధించాడు. "అత్యంత కీలకమైన మ్యాచ్‌లలో తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటూ, నీ సహజమైన ఆటతీరును ఎలా కొనసాగిస్తావు?" అని అడిగాడు. దీనికి 39 ఏళ్ల మెస్సీ తన సహజసిద్ధమైన వినయంతో ఇచ్చిన సమాధానం అందరినీ ఆలోచింపజేసింది. "ఒత్తిడి గురించి నేను ఎప్పుడూ ఎక్కువగా ఆలోచించలేదు. మైదానంలోకి వెళ్లి ఆడటాన్ని, ఆస్వాదించడాన్ని, పోటీపడటాన్ని ఒక సహజమైన ప్రక్రియగా చూశాను. మేమంతా తీవ్రమైన పోటీతత్వం ఉన్నవాళ్లం, ఎప్పుడూ గెలవాలనే కోరుకుంటాం. కానీ, ఇది కేవలం ఒక ఆట అని, ప్రత్యర్థి కూడా ఆడతాడని, ప్రతీసారి గెలవడం సాధ్యం కాదని కూడా అర్థం చేసుకోవాలి" అని మెస్సీ వివరించాడు. ఇంకా మాట్లాడుతూ.. "కాలక్రమేణా నేను ఒక విషయం నేర్చుకున్నాను. గెలిచేదాని కంటే ఓడిపోయేదే ఎక్కువ. ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోవడం ఒక వ్యక్తిగా, ఒక ఆటగాడిగా నేను ఎదగడానికి ఎంతగానో సహాయపడింది" అని తెలిపాడు. ఈ ఇద్దరు దిగ్గజాల మధ్య జరిగిన సంభాషణ, వారి వారి క్రీడల్లో దాదాపు రెండు దశాబ్దాలుగా ఆధిపత్యం చెలాయిస్తున్న వారి మధ్య ఉన్న పరస్పర గౌరవాన్ని కళ్లకు కట్టింది. ఈ కార్యక్రమానికి ఎన్ఎఫ్ఎల్ లెజెండ్ టామ్ బ్రాడీ, ఎన్‌బీఏ స్టార్ కెవిన్ డ్యూరాంట్ వంటి ఇతర క్రీడా ప్రముఖులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా మెస్సీ.. జొకోవిచ్, బ్రాడీ, డ్యూరాంట్‌లతో కలిసి తీసుకున్న సెల్ఫీ వైరల్‌గా మారింది. 1962లో బ్రెజిల్ తర్వాత వరుసగా రెండుసార్లు ప్రపంచకప్ గెలిచిన జట్టుగా చరిత్ర సృష్టించాలని అర్జెంటీనా పట్టుదలతో ఉంది. ఇలాంటి కీలక సమయంలో మెస్సీ మాటలు.. ఏళ్ల తరబడి గెలుపోటముల నుంచి అతడు సంపాదించిన పరిణతి చెందిన మానసిక దృక్పథాన్ని తెలియజేస్తున్నాయి. రేపు మెట్‌లైఫ్ స్టేడియంలో జరిగే ఫైనల్‌లో స్పెయిన్‌తో తలపడేందుకు అర్జెంటీనా ఇదే స్ఫూర్తితో సిద్ధమవుతోంది.

# మెస్సీ ఆట అసాధారణం: షకీరా



ఫిఫా వరల్డ్‌కప్-2026 ఫైనల్‌కు ముందు అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీపై పాప్ స్టార్ షకీరా చేసిన ఇన్‌స్టాగ్రామ్ పోస్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మెస్సీ ఆటతీరుతో పాటు ఆయన భార్య ఆంటొనెలా రొకుజ్జోను కూడా ప్రశంసిస్తూ షకీరా చేసిన వ్యాఖ్యలు అభిమానుల దృష్టిని ఆకర్షించాయి. ఈ పోస్టును ఆంటొనెలా తన ఇన్‌స్టాగ్రామ్‌లో మళ్లీ షేర్ చేయడం మరింత చర్చకు దారి తీసింది. స్పెయిన్‌తో జరగనున్న వరల్డ్‌కప్ ఫైనల్‌కు ముందు షకీరా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో మెస్సీ ఫొటోను షేర్ చేసింది. 39 ఏళ్ల వయసులో మెస్సీ చూపుతున్న ఆట అసాధారణమని కొనియాడింది. వయసు, ఇతరుల వ్యాఖ్యలు మనిషిని నిర్ణయించవని, అంకితభావం, క్రమశిక్షణ ఉంటే ఎలాంటి సవాళ్లనైనా అధిగమించవచ్చని మెస్సీ నిరూపిస్తున్నాడని పేర్కొంది. ఆంటొనెలా రొకుజ్జో గురించి కూడా షకీరా ప్రత్యేకంగా ప్రస్తావించింది. మెస్సీ పక్కన ఆంటొనెలా లాంటి మహిళ ఉండటమే ఆయనకు బలం, స్ఫూర్తిగా నిలుస్తోందని చెప్పింది.

# నేడు మూడో వన్డే

## రోహిత్ శర్మకు ఆఖరి మ్యాచ్?.. భారత తుది జట్టు ఇదే!



**ఇంగ్లండ్‌తో మూడో వన్డే భారత తుది జట్టు(అంచనా)**

రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్(కెప్టెన్), విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్/కేఎల్ రాహుల్, అక్షర్ పటేల్, శివమ్ దూబే, కుల్దీప్ యాదవ్/రవి బిష్ణోయ్, జస్‌ప్రీత్ బుమ్రా, ప్రసిధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్/అర్ష్‌దీప్ సింగ్.

**ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న టీమిండియా కీలక పోరుకు సిద్ధమైంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగే డిసైడర్ మ్యాచ్‌లో ఆతిథ్య ఇంగ్లండ్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ భారత్ గెలవగా.. రెండో వన్డేలో ఇంగ్లండ్ గెలిచి సిరీస్‌లో సమంగా నిలిచింది.**

**దాంతో లార్డ్స్ వేదికగా జరిగే ఆఖరి మ్యాచ్ సిరీస్ డిసైడర్‌గా మారింది. అంతేకాకుండా టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మకు ఇదే చివరి మ్యాచ్ అని ప్రచారం జరుగుతుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. వన్డే ప్రపంచకప్ 2027 ప్రణాళికల నుంచి తొలగించామని భారత సెలెక్టర్లు రోహిత్ శర్మకు సమాచారమిచ్చారని, భవిష్యత్తు తేల్చుకోవాలని సూచించారని వార్తలు వచ్చాయి.**

ఆఖరి వన్డే కోసం రోహిత్ శర్మ కుటుంబ సభ్యులు లార్డ్స్ చేరుకోవడం ఈ వార్తలకు బలం చేకూరుస్తోంది. ఈ ప్రచారాన్ని బీసీసీఐ కూడా ఖండించలేదు. ఈ క్రమంలోనే లార్డ్స్ వన్డే రోహిత్ శర్మకు చివరిదనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ సిరీస్‌లో రోహిత్ తీవ్రంగా నిరాశపర్చాడు. తొలి వన్డేలో 11 పరుగులే చేసిన అతను.. రెండో వన్డేలో 26 పరుగులకే ఔటయ్యాడు. కనీసం తన ఆఖరి మ్యాచ్‌గా భావిస్తున్న లార్డ్స్‌లోనైనా సత్తా చాటి తన కెరీర్‌ను ఘనంగా ముగించాలని, లేదంటే ఈ పుకార్లు అబద్ధం కావాలని రోహిత్ ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఈ మ్యాచ్‌కు ముందు టీమిండియాను గాయాల బెడద వేధిస్తోంది. అనారోగ్యంతో రెండో వన్డేకు కేఎల్ రాహుల్ దూరంగా కాగా.. తొడ కండరాల గాయంతో వాషింగ్టన్ సుందర్ మూడో వన్డేకు దూరమయ్యాడు. అంతేకాకుండా టీమిండియా కాంబినేషన్‌పై విమర్శలు వస్తున్నాయి. జట్టులో ఆల్‌రౌండర్లకు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నారని, వారిని ఎక్కువగా నమ్ముకోవడం అవివేకమని మాజీ క్రికెటర్లు మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే మూడో వన్డేకు టీమిండియా కూర్పు ఎలా ఉండబోతుందనేది చర్చనీయాంశంగా మారింది. గాయంతో దూరమైన వాషింగ్టన్ సుందర్ స్థానంలో కుల్దీప్ యాదవ్ ఆడే అవకాశాలు ఉన్నాయి. కాస్త బ్యాటింగ్ సామర్థ్యం కావాలనుకుంటే రవి బిష్ణోయ్‌కు అవకాశం దక్కుతుంది. ఎక్స్‌ట్రా బ్యాటర్‌తో బరిలోకి దిగాలనుకుంటే కేఎల్ రాహుల్‌తో పాటు ఇషాన్ కిషన్ కూడా జట్టులో కొనసాగుతాడు. కానీ మేనేజ్‌మెంట్ కుల్దీప్ యాదవ్‌వైపు ఎక్కువ మొగ్గు చూపవచ్చు. మిగతా కాంబినేషన్‌లో పెద్దగా మార్పులు జరిగే అవకాశం కనిపించడం లేదు. ఓపెనర్లుగా రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ బరిలోకి దిగనుండగా.. విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్/ఇషాన్ కిషన్ మిడిలార్డర్‌లో ఆడనున్నారు. అక్షర్ పటేల్, శివమ్ దూబే లోయరార్డర్ బాధ్యతను మోయనున్నారు. సుందర్ స్థానంలో ఎక్స్‌ట్రా బ్యాటర్‌ను తీసుకుంటే.. శివమ్ దూబేను తప్పించి ఎక్స్‌ట్రా పేసర్ లేదా స్పెషలిస్ట్ స్పిన్నర్‌ను ఆడించవచ్చు. పిచ్ కండిషన్స్‌ను బట్టి ఈ నిర్ణయం తీసుకోనున్నారు. జస్‌ప్రీత్ బుమ్రా, గుర్నూర్ బ్రార్,ప్రసిధ్ కృష్ణ పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్‌ల్లో ఒకర్ని ఆడించాలనుకుంటే గుర్నూర్ బ్రార్, ప్రసిధ్ కృష్ణలో ఒకరు బెంచ్‌కే పరిమితమవుతారు.


## షూటర్ దయమంతి

# సేన్ సేఫ్

పశ్చిమ బెంగాల్‌లో తీవ్ర ఉత్కంఠ రేపిన నేషనల్ లెవల్ షూటర్ దమయంతి సేన్ అదృశ్యం కేసు సుఖాంతమైంది. గురువారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయిన ఆమె, ఇవాళ ఉదయం సురక్షితంగా ఇంటికి చేరారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు, స్నేహితులు, క్రీడా వర్గాలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, ఈ రెండు రోజులు ఆమె ఎక్కడికి వెళ్లింది, ఏం జరిగిందనే మిస్టరీ మాత్రం



ఇంకా కొనసాగుతోంది. వివరాల్లోకి వెళితే.. ఇవాళ ఉదయం కోల్‌కతాకు సమీపంలోని హౌరా జిల్లా రామ్‌కృష్ణాపుర్ ఫెర్రీ జెట్టీ వద్ద 15 ఏళ్ల దమయంతి ఒంటరిగా కనిపించింది. మార్నింగ్ వాక్‌కు వచ్చిన కొందరు ఆమెను గుర్తించి, వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న ఆమె తండ్రి ధ్రుబజ్యోతి సేన్, కుమార్తెను ఇంటికి తీసుకెళ్లారు. ఆమె క్షేమంగా తిరిగి రావడంతో అందరూ సంతోషం వ్యక్తం చేసినప్పటికీ, ఈ వ్యవహారంపై మాట్లాడేందుకు కుటుంబ సభ్యులు నిరాకరిస్తున్నారు. దమయంతి అదృశ్యంపై దర్యాప్తు చేసేందుకు నిన్న ఏర్పాటు చేసిన నాలుగు సభ్యుల ప్రత్యేక దర్యాప్తు బృందం కూడా ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. దీంతో ఆమె రెండు రోజుల పాటు ఎక్కడ ఉంది, ఎందుకు వెళ్లిందనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. సెంట్రల్ హౌరాలో నివాసం ఉంటున్న దమయంతి ఇటీవలే జాతీయ జట్టు ట్రయల్స్‌కు ఎంపికైంది. గురువారం మధ్యాహ్నం ఇంట్లో కొన్ని వస్తువులు తీసుకురావడానికి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. వెళ్లేటప్పుడు ఆమె తన మొబైల్ ఫోన్‌ను వెంట తీసుకెళ్లినట్లు తల్లిదండ్రులు తెలిపారు.



# జపాన్ ఓపెన్ ఫైనల్‌లో సింధు

## సెమీస్‌లో చెన్ యుఫెయ్ వాకౌట్

**భారత స్టార్ షట్లర్, తెలుగు తేజం పీవీ సింధు అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ జపాన్ ఓపెన్ 2026 టోర్నమెంట్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లింది. మహిళల సింగిల్స్ సెమీఫైనల్ మ్యాచ్‌లో చైనాకు చెందిన ప్రపంచ 4వ ర్యాంకర్, మాజీ ఒలింపిక్ ఛాంపియన్ చెన్ యుఫెయ్ గాయం కారణంగా మధ్యలోనే వైదొలగడంతో సింధు విజయం సాధించింది.**


**ఈ విజయంతో సింధు ఈ సీజన్‌లో తొలిసారి ఒక టోర్నమెంట్‌లో ఫైనల్‌కు చేరినట్లయింది. మ్యాచ్ ప్రారంభం నుంచే సింధు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. తన దూకుడైన ఆటతీరు, వేగవంతమైన కదలికలతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసింది. తొలి గేమ్‌లో ఒక దశలో నాలుగు పాయింట్ల ఆధిక్యాన్ని సంపాదించింది.**

చెన్ యుఫెయ్ బలంగా పుంజుకుని స్కోరును 19-19తో సమం చేసింది. కీలకమైన ఈ సమయంలో సింధు ఒత్తిడిని జయించి, నిలకడగా ఆడి తొలి గేమ్‌ను 21-19 తేడాతో కైవసం చేసుకుంది. రెండో గేమ్‌లోనూ సింధు అదే జోరు కొనసాగించింది. ఆరంభం నుంచే ర్యాలీలను శాసిస్తూ వేగంగా పాయింట్లు సాధించింది. అనతికాలంలోనే 15-10 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మ్యాచ్ పూర్తిగా సింధు చేతుల్లోకి వెళుతున్న సమయంలో, తొడ కండరాల గాయంతో బాధపడుతున్న చెన్ యుఫెయ్ ఆటను కొనసాగించలేక రిటైర్డ్ హర్ట్‌గా వైదొలిగింది. దీంతో సింధు ఫైనల్‌కు చేరినట్లు అంపైర్లు ప్రకటించారు. 2026లో సింధు ప్రదర్శిస్తున్న అద్భుతమైన పునరాగమనంలో ఈ విజయం మరో మైలురాయి. ఈ ఏడాదిని ప్రపంచ 18వ ర్యాంకర్‌గా ప్రారంభించిన 31 ఏళ్ల సింధు, వరుస విజయాలతో ప్రస్తుతం 9వ ర్యాంకుకు చేరుకుని తిరిగి తన ఫామ్‌ను అందుకున్నట్లు నిరూపించుకుంది. ఈ సీజన్‌లో మలేషియా




ఓపెన్ (సూపర్ 1000), ఆస్ట్రేలియన్ ఓపెన్ (సూపర్ 500) తర్వాత సింధు సెమీ ఫైనల్ చేరడం ఇది మూడోసారి. కాగా, శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్‌లో జపాన్ క్రీడాకారిణి నొజోమి ఒకుహర కూడా గాయంతో వైదొలగడంతో సింధుకు వాకోవర్ లభించింది. దీంతో ఆమె నేరుగా సెమీస్‌కు అర్హత సాధించింది. 2023 డెన్మార్క్ ఓపెన్ తర్వాత ఒక సూపర్ 750 టోర్నమెంట్‌లో సింధు సెమీఫైనల్‌కు చేరడం ఇదే తొలిసారి. ఆదివారం జరిగే ఫైనల్‌లో జపాన్ క్రీడాకారిణి అకానె యమగుచి లేదా ఇండోనేషియాకు చెందిన పుత్రి కుసుమ వర్దానితో సింధు తలపడనుంది.

# కేసీఆర్ నెత్తిన పాలు!






బీఆర్ఎస్ నుంచి బయటికి వస్తూ ఈటల రాజేందర్ ఎదుర్కొన్న అవమానాలు తక్కువేం కాదు. అనేక కేసులు ఎదుర్కొన్నారు. రాజకీయంగానూ ఇబ్బంది పడ్డారు. ఒకానొక సందర్భంలో తాను సొంత పత్రికగా భావించిన 'నమస్తే తెలంగాణ'లోనే వ్యతిరేక కథనాలు వస్తే తీవ్రంగా బాధపడ్డారు. పత్రిక అభివృద్ధికి పాటుపడ్డ తనకు.. పత్రికలో వ్యతిరేక కథనాలు బాధించాయని నిట్టూర్చారు. కానీ, కాళేశ్వరం ఎంత గొప్ప ప్రాజెక్టో ఆయనకు తెలుసు. తెలంగాణ ప్రజలకూ తెలుసు. ఆ ఫలాలు అనుభవించిన, అనుభవిస్తున్న ప్రతీ ఒక్కరికి తెలుసు. అందుకే.. కాళేశ్వరం గొప్ప ప్రాజెక్టు అని, రైతన్నల దాహార్తి తీర్చే బంధు అని కొనియాడారు. ప్రజల మనసుల్లో ఉన్నదే ఆయన బయటకు చెప్పారు. ఈటల ఇలా అన్నారట.. అని చర్చ వస్తే, కరెక్టే కదా! అని ప్రజల మెదళ్లలో ఆలోచన వస్తుంది. అలాంటిది కాళేశ్వరం ప్రాజెక్టును 'కూలేశ్వరం' అంటూ రేవంత్ రెడ్డి, ఇతర నాయకులు మాట్లాడే ప్రతీసారి.. కృష్ణుడు శిశుపాలుడి తప్పులను లెక్కించినట్లు, ప్రజలు కాళేశ్వరంపై దూషణలను లెక్కిస్తున్నారు. అది మాత్రం నిజం.

శ్రావణ వాణి

"కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌ను కోసి రక్తం చల్లాలె.. కేసీఆర్ స్ట్రెచర్‌పై పన్నడు, అటే పోతడు.. రిటైర్డ్ ఇంజినీర్లను జైల్లో పెట్టాలె.. నీ నెత్తి మీద కాలువెట్టి తొక్కుత.." రాజకీయాల్లో మాట ఒక ఆయుధం. అదే మాట కొన్నిసార్లు అధికారాన్ని తెస్తుంది. అదే మాట మరికొన్నిసార్లు అధికారాన్ని దూరం చేస్తుంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఘాటు విమర్శలు ప్రజలకు నచ్చుతాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే ధోరణి కొనసాగితే మాత్రం ప్రజలు ప్రశ్నించడం మొదలుపెడతారు. ఎందుకంటే అధికారంలో ఉన్న నాయకుడి నుంచి ప్రజలు ఆశించేది విమర్శలు కాదు.. పరిష్కారాలు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు దాటింది. ఎన్నికల సమయంలో ప్రజలు కాంగ్రెస్‌కు ఇచ్చిన తీర్పు బీఆర్ఎస్‌ను ఓడించడానికి మాత్రమే కాదు; కొత్త పాలనకు అవకాశం ఇవ్వడానికీ. అందుకే ప్రజలు ఆశించింది కొత్త ఆలోచన, కొత్త పరిపాలన, కొత్త ఫలితాలు. కానీ రాజకీయ వేదికలపై ఇప్పటికీ వినిపిస్తున్న ప్రధాన చర్చ గత ప్రభుత్వం, కేసీఆర్, బీఆర్ఎస్ గురించే. ప్రశ్న ఒక్కటే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా 2023 ఎన్నికల ప్రచారంలోనే ఉందా? లేక 2026 పాలనలో ఉందా?

తెలంగాణలో గత రెండున్నరేళ్లుగా రాజకీయ చర్చలను గమనిస్తే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగాల్లో బీఆర్ఎస్, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆ పార్టీ నాయకత్వంపై విమర్శలకు అధిక ప్రాధాన్యం కనిపిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల కంటే రాజకీయ ప్రత్యర్థులపై వ్యాఖ్యలే ఎక్కువ చర్చకు దారితీస్తున్నాయి. ఇదే సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదనే విమర్శలు ఉన్నాయి. రైతుల సమస్యలు, ఉద్యోగ నియామకాల వేగం, మౌలిక సదుపాయాలు, స్థానిక సంస్థల అభివృద్ధి, పట్టణ సమస్యలు, పెట్టుబడులు, పరిశ్రమలు, ధరల భారం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల సమయంలో ప్రత్యర్థిని విమర్శించడం సహజం. ప్రజలు కూడా అంగీకరిస్తారు. కానీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి సభలోనూ, ప్రతి కార్యక్రమంలోనూ, ప్రతి రాజకీయ వేదికపైనా ప్రత్యర్థినే ప్రధాన అంశంగా మార్చితే, ప్రజలు ప్రభుత్వ పనితీరును కొలవడం మొదలుపెడతారు. రాజకీయాల్లో ఒక మౌలిక సూత్రం ఉంది. మీరు ఎవరిని ఎక్కువగా విమర్శిస్తారో.. ప్రజల దృష్టిలో అతడే మీ ప్రధాన ప్రత్యర్థిగా నిలుస్తాడు. బీఆర్ఎస్ 2023లో అధికారాన్ని కోల్పోయింది. సహజంగా అధికార పార్టీ తన పరిపాలనతో ముందుకు వెళ్లి కొత్త రాజకీయ అజెండాను రూపొందించాలి. కానీ ప్రతి సందర్భంలోనూ కేసీఆర్ పేరు ప్రస్తావనకు వస్తే, రాజకీయ చర్చల కేంద్రంలో కూడా ఆయనే ఉంటారు. రాజకీయాల్లో ప్రచారం రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి.. స్వయంగా సంపాదించుకునే ప్రచారం. రెండోది.. ప్రత్యర్థి కల్పించే ప్రచారం. ప్రస్తుతం రెండోది ఎక్కువ ప్రభావం చూపుతుంది. అది కేసీఆర్‌కు ప్లస్ అయ్యేలా. భారత రాజకీయాల్లో ఇలాంటి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. ఇందిరా గాంధీపై నిరంతర వ్యక్తిగత దాడులు జరిగినప్పుడు కొంతకాలం సానుభూతి పెరిగింది. గుజరాత్‌లో నరేంద్ర మోదీపై వరుస విమర్శలు ఆయనను జాతీయ రాజకీయాల్లో మరింత బలపరిచిన సందర్భాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్‌పై నిరంతర విమర్శలు ఆయనకు కొన్ని దశల్లో రాజకీయ లాభం చేకూర్చినట్లు విశ్లేషణలు వెలువడ్డాయి. తెలంగాణలో కేసీఆర్ విషయంలోనూ ఇలాంటి పరిస్థితి ఏర్పడే అవకాశాన్ని రేవంత్ రెడ్డి కల్పిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో విధానాలపై విమర్శలు ఉండాలి. అవినీతి ఉంటే ఆధారాలతో బయటపెట్టాలి. తప్పులు ఉంటే విచారణ జరగాలి. కానీ వ్యక్తిగత దూషణలు, అవమానకర పదజాలం, ఆరోగ్యంపై లేదా వ్యక్తిగత జీవితంపై వ్యాఖ్యానించడం ప్రజాస్వామ్య సంస్కృతికి మేలు చేయదు. అధికారంలో ఉన్న నాయకుడి మాట సాధారణ



రాజకీయ నాయకుడి మాట కాదు. అది ప్రభుత్వ స్వరం. ఆ స్వరంలో హుందాతనం ఉండాలి. రాజకీయాల్లో సానుభూతి ఒక శక్తివంతమైన అంశం. ఒక నాయకుడిపై వరుసగా వ్యక్తిగత స్థాయిలో దాడులు జరిగితే, కొంతమంది ఓటర్లలో సానుభూతి పెరిగే అవకాశం ఉంటుంది. అదే సమయంలో ప్రభుత్వం తన విజయాల కంటే ప్రత్యర్థి గురించే ఎక్కువ మాట్లాడితే, ప్రజలు 'ప్రభుత్వానికి ఇంకా గత ప్రభుత్వమే భయం కలిగిస్తున్నదా?' అనే సందేహం వ్యక్తం చేస్తారు. ఇలాంటి అవకాశమే రేవంత్ రెడ్డి.. కేసీఆర్‌కు కల్పిస్తున్నారు. తెలంగాణలో ప్రధాన రాజకీయ పోటీ ఇప్పటికీ కాంగ్రెస్–బీఆర్ఎస్ మధ్యే కొనసాగుతోంది. బీజేపీ సంస్థాగతంగా బలపడేందుకు ఇంకా కృషి చేయాల్సి ఉంది. అధికార పక్షం తన ప్రధాన రాజకీయ దాడులను బీఆర్ఎస్‌పైనే కేంద్రీకరించడం వల్ల రాజకీయ చర్చ కూడా అదే రెండు పార్టీల చుట్టూ తిరుగుతోంది. మరో ముఖ్య విషయం ఏంటంటే.. బీజేపీ కూడా అధికార కాంగ్రెస్‌ను కాకుండా, గత బీఆర్ఎస్ సర్కారును విమర్శిస్తోంది. ఇది ప్రజల్లో బీఆర్ఎస్‌పై సానుభూతిని పెంచుతోంది.. కాదు కాదు పెంచింది. గత ప్రభుత్వంపై ఆరోపణలు వినడానికి ప్రజలు పరిమిత సమయమే కేటాయిస్తారు. ఆ తర్వాత వారు అడిగేది ఒక్కటే. 'మీరేం చేశారు?' అని.

ఇది ప్రతి ప్రభుత్వం ఎదుర్కొనే ప్రశ్న. గత ప్రభుత్వాన్ని వెయ్యిసార్లు విమర్శించినా, ఒక్క ఉద్యోగం ఇవ్వలేకపోతే.. ఒక్క రైతు సమస్య పరిష్కరించలేకపోతే.. ఒక్క పరిశ్రమ తీసుకురాలేకపోతే.. ప్రజల తీర్పు మారదు. ఇప్పటి ఓటరు సోషల్ మీడియాలో ప్రతి ప్రసంగం చూస్తున్నాడు. ప్రతి హామీ గుర్తుంచుకుంటున్నాడు. ప్రతి ఆలస్యం నమోదు చేస్తున్నాడు. 'గత ప్రభుత్వం తప్పు చేసింది అంటే సరే.. కానీ ఇప్పుడు మీ ప్రభుత్వం ఏం చేసింది?' ఈ ఒక్క ప్రశ్నే ప్రతి అధికార పక్షానికి ఎదురవుతుంది. తెలంగాణ పదకొండేళ్ల రాష్ట్రం. ఇప్పుడు రాష్ట్రానికి అవసరమైనది గతాన్ని తవ్వే రాజకీయాలు కాదు. భవిష్యత్తును నిర్మించే రాజకీయాలు. ప్రతి సభలో కేసీఆర్ పేరు వినిపించడం కంటే, ప్రతి జిల్లాలో కొత్త పరిశ్రమ ప్రారంభమైతే ప్రజలు ఎక్కువ సంతోషిస్తారు. ప్రతి వేదికపై బీఆర్ఎస్‌ను విమర్శించడం కంటే.. ప్రతి గ్రామంలో తాగునీరు అందితే ప్రజలు ప్రభుత్వాన్ని గుర్తుంచుకుంటారు. ప్రతి రోజు ఆరోపణలు చేయడం కంటే.. ప్రతి నెల ఉద్యోగాలు ఇస్తే యువత చప్పట్లు కొడుతుంది. "రాజకీయాల్లో ప్రత్యర్థిని ఓడించడం గొప్ప విషయం కాదు. ప్రజల మనసు గెలవడమే గొప్ప విషయం. ప్రత్యర్థిని విమర్శించడం ఎన్నికలు గెలిపించవచ్చు. కానీ పాలనను మాత్రం విజయవంతం చేయదు. ప్రజల తీర్పు ఎప్పుడూ ఒకటే.. మాటలు కాదు... పనులు చూపించండి. తెలంగాణ రాజకీయాలకు కూడా ఇదే వర్తిస్తుంది. ప్రభుత్వం తన విజయాలతో వార్తల్లో నిలవాలి. ప్రత్యర్థిని తిట్టడం వల్ల కాదు. ఎందుకంటే రాజకీయాల్లో చివరకు గుర్తుండేది ప్రసంగాలు కాదు.. ప్రజల జీవితాల్లో కనిపించిన మార్పే."

**అసందర్భం.. కానీ సందర్భోచిత!**

చంద్రబాబు వస్తే కరువొస్తది, లేకపోతే వరదలొస్తయ్ అన్న అపవాదు ఉంది. అదేంటో పాపం.. నిజంగానే అలాంటి సందర్భాలను ఆయన ఎదుర్కొన్నారు. గొప్ప అడ్మినిస్ట్రేటర్ అయినా, ఆ ముద్ర తప్పలేదు. ఇప్పుడు చంద్రబాబుకు తోడుగా రేవంత్ రెడ్డి కూడా వచ్చారని.. దాంతో ఎల్‌నినో లాంటి తీవ్ర విపత్తు వస్తోందని చర్చ నడుస్తోంది. 'చంద్రబాబు, తన శిష్యుడు కలిసి తెలుగు రాష్ట్రాలను కరువులోకి నెట్టేస్తున్నారు' అన్న అపవాదును వారికి అంటగట్టే చర్యలు కూడా ప్రారంభం అయ్యాయి. ఆ ప్రచారాన్ని ప్రజలు నమ్మినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఇక్కడ ఒక వాస్తవాన్ని చెప్పుకోవాలి. అదేంటంటే.. ప్రపంచమంతా ఎల్ నినో వస్తోంది.. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు కదా. కానీ, అలా సింక్ అయ్యింది మరి.

ఎల్ నినో వస్తుందట.. మా పంటలెట్ల?
ఎహే.. కాళేశ్వరం కూలేశ్వరం అయ్యింది!

రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పడిపోయింది?
ధరణి పోర్టల్‌తో బీఆర్ఎస్ దోచుకుంది!

ధాన్యం కొంటలేరు.. ఎరువులు దొరుకుతలేవు?
బీఆర్ఎస్ రైతును అప్పులపాలు చేసింది!

నోటిఫికేషన్లు వస్తలేవు, కొత్త ఉద్యోగాలేవి?
బీఆర్ఎస్ నిరుద్యోగులను మోసం చేసింది!

రైతు భరోసా నిధులు ఎప్పుడు వేస్తరు?
రాష్ట్రం అప్పుల కుప్పగా మారిపోయింది!

పట్నంలో భూగర్భ జలాలు అడుగంటాయి?
మిషన్ భగీరథతో బీఆర్ఎస్ దోచుకుంది!

రోడ్లు పాడైనయ్, ట్రాఫిక్ నియంత్రణ లేదు?
కేసీఆర్ రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసిండు!

ఆరు గ్యారెంటీలేవి? ఎన్నికల హామీలేవి?
కేసీఆర్ పాపాల భైరవుడు..
హరీశ్, కేటీఆర్ తోడేళ్లు..

ప్రజలు అడుగుతున్న ప్రశ్నలవి..!
పాలకులు చెప్తున్న సమాధానాలివి..!



శ్రావణ్ కుమార్ బొమ్మకంటి
ఎడిటర్, ఎంటెక్, ఎల్ఎల్‌బీ
ఫోన్ నంబర్: 9581291919

**ఇది కాదు ప్రజలు కోరుకున్న మార్పు..!**

**ఆత్మగౌరవం కోసమే ఇచ్చారు కొత్త తీర్పు..!!**

**దూషణలు, దాతవేతలతోనే పాలకుల కాలం గడుపు..!**

**ఇది అసలే కాదు రాజకీయ నేర్పు..!!**

**అయినా పడుతున్నారు ఓటర్లు ఓర్పు..!**

**తప్పదు మరో మలుపు..!**

**దక్కదు మళ్లీ గెలుపు!!**

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.